


# విశ్వంవాయిస్

అవినీతిపై అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 68 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | సోమవారం 01 డిసెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


'పొలిటికల్ గవర్నెన్స్'

## కూటమి ప్రభుత్వ విధానం

**మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్యకర్తలతో సీఎం టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** పింఛన్ల పంపిణీలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్యకర్తలతో సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "పార్టీ కార్యక్రమాలకు సంబంధించి డిసెంబర్ క్యాలెండర్ రూపొందించాం. ప్రతినెలా 1న ఎలాంటి ఆటంకం లేకుండా పింఛన్ల పంపిణీ జరుగుతోంది. పింఛన్ల కోసమే ఇప్పటి వరకు రూ.50,763 కోట్లు ఖర్చు పెట్టాం. దేశంలోనే ఇది అతిపెద్ద డీబీటీ కార్యక్రమం. 17 నెలలుగా నేనే స్వయంగా పాల్గొని పెన్షన్లు అందిస్తున్నా. పొలిటికల్ గవర్నెన్స్ అన్నది కూటమి ప్రభుత్వ విధానం. సంక్షేమ కార్యక్రమాలు అందించడంతోపాటు ప్రజలతో మమేకం కావాలి. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇచ్చి గౌరవిస్తున్నాం. కొన్ని చోట్ల అనర్హులకు పింఛన్లు అందుతున్నాయి. అర్హులకు ఎట్టిపరిస్థితుల్లోనూ అన్యాయం జరగదు. గత పాలకుల విధ్వంసంతో రాష్ట్రానికి ఇబ్బందులు వచ్చాయి. ఉగాది నాటికి మరో 5లక్షల ఇళ్లను ప్రజలకు అందిస్తాం. అర్హుడైన పేదవాడికి సొంత ఇల్లు ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యం" అని సీఎం తెలిపారు.

డిజిటల్ అరెస్టు కేసులో

## ముగ్గురు నిందితుల అరెస్టు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** డిజిటల్ అరెస్టు కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులు పండు వినీత్‌రాజ్, తిరుపతయ్య, గౌని విశ్వనాథామ్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలను పండు వినీత్‌రాజ్ సమకూర్చగా.. జాయింట్ హోల్డర్లుగా తిరుపతయ్య, విశ్వనాథం ఉన్నారు. నిందితులపై దేశవ్యాప్తంగా 5 కేసులుండగా.. వాటిలో తెలంగాణలోనే 2 కేసులు ఉన్నాయి. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు సందీప్ కోసం పోలీసులు

- మిగతా 2లో

మాదక ద్రవ్యాలను

## నిర్మూలించండి

- రాష్ట్రాల డీజీపీ, ఐజీపీల సమావేశంలో అమిత్‌షా పిలుపు
- సమావేశంలో బండి సంజయ్, దోభాల్, అమిత్ షా, మోదీ




**రాయ్‌పూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** మాదక ద్రవ్యాలను, వ్యవస్థీకృత నేరాలను నిర్మూలించేందుకు రాష్ట్రాల పోలీసు ప్రధానాధికారులు అన్ని చర్యలూ తీసుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పిలుపునిచ్చారు. అందుకు కచ్చితమైన నిఘా, వ్యవస్థాగత సమన్వయం అవసరమన్నారు. శనివారం రాష్ట్రాల పోలీసు ప్రధానాధికారుల 60వ వార్షిక సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రధాని మోదీ సైతం పాల్గొన్న ఈ మూడు రోజుల సదస్సును అమిత్‌షా ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల డీజీపీలు, ఐజీపీలను ఉద్దేశించి అమిత్‌షా మాట్లాడుతూ "మేలిమి పోలీసింగ్ పద్ధతులు, ఈ రంగంలో వచ్చిన కొత్తదనాలపై చర్చించడానికి ఇది అద్భుత వేదిక" అన్నారు. ఈ సదస్సు ఛత్తీస్‌గడ్‌లోని రాయ్‌పూర్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో గోప్యంగా, కెమెరాలు అనుమతించని వాతావరణంలో జరుగుతోంది.. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు

- మిగతా 2లో

పరిశోధన రంగంలో

## భారత్ దూసుకుపోతోంది : మోదీ



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** పరిశోధన రంగంలో భారత్ దూసుకుపోతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచంలో ఏదైనా సాధించే సత్తా భారత్‌కు ఉందన్నారు. మన్ కీ బాత్ 128వ ఎపిసోడ్‌లో ప్రధాని ప్రసంగించారు. మన యువత అసమాన శక్తి, బలమైన సంకల్పంతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని పేర్కొన్నారు. గత 11 ఏళ్లలో విజ్ఞానం, క్రీడలు, సామాజిక సేవ, సంస్కృతి వంటి వివిధ రంగాల్లో యువత అద్భుతమైన ప్రతిభ కనబరిచారని ప్రశంసించారు. కష్టతరమైన వాటిని కూడా భారత్ సాధిస్తోందని.. మహిళల అంధుల క్రికెట్ జట్టు ప్రపంచకప్ గెలిచి చరిత్ర సృష్టించిందని అన్నారు. స్టార్టప్ ఇండియా,

- మిగతా 2లో

## ఎచ్చెర్ల సమీపంలో సముద్రతీరానికి బంగ్లాదేశ్ మత్స్యకారులు



**ఎచ్చెర్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం మూసవానిపేట వద్ద సముద్రతీరానికి బంగ్లాదేశ్‌కు చెందిన బోటు కొట్టుకొచ్చింది. అందులో 13 మంది మత్స్యకారులు ఉన్నారు. స్థానికులు, మెరైన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంగ్లాదేశ్‌కు చెందిన 13 మంది మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లి తప్పిపోయారు. వెంట తెచ్చుకున్న ఇంధనం, భోజన సామగ్రి అయిపోవడంతో చేసేది లేక సముద్రంలో అలా కొన్ని రోజులు ఉండిపోయారు. పశ్చిమ బెంగాల్, ఒడిశా మీదుగా శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బడివానిపేట పంచాయతీ మూసవానిపేట వద్ద తీరంలో లంగరు వేసుకొని ఉండిపోయారు. గమనించిన స్థానిక మత్స్యకారులు.. సంబంధిత బోటు ఈ ప్రాంతానికి చెందినది కాదని, అందులో ఉన్నవారు అనుమానితులుగా ఉన్నట్లు గుర్తించి స్థానిక, మెరైన్ పోలీసులకు సమాచారం అందించారు. మెరైన్ సీఐ బి.ప్రసాదరావు, స్థానిక ఎస్సై జి.లక్ష్మణరావులు సిబ్బందితో సముద్రతీరానికి చేరుకొని మూడు బోట్ల సాయంతో సముద్రంలోకి సిబ్బందిని పంపించి వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఒడ్డుకు వచ్చిన మత్స్యకారుల భాష, వేషధారణ ఆధారంగా బంగ్లాదేశ్‌కు చెందిన వారిగా గుర్తించారు. స్థానికులు, పోలీసులు వారితో మాట్లాడేందుకు ప్రయత్నించినా.. నీరసం, భయంతో వివరాలు చెప్పేందుకు ఇబ్బందిపడ్డారు. బంగ్లాదేశ్ భాష కొంచెం తెలిసిన స్థానిక మత్స్యకారులు వారితో మాట్లాడే ప్రయత్నం చేసి కొంత సమాచారం రాబట్టారు. వారం, పదిరోజుల నుంచి భోజనం లేదని, సముద్రంలో ఎటు వెళ్తున్నామో తెలియని పరిస్థితిలో ఉండిపోయామని బంగ్లాదేశ్ మత్స్యకారులు వాపోయారు. 15 రోజులపైగా సముద్రంలో ఉండిపోయి, పరిస్థితి అల్లకల్లోలంగా ఉండటంతో భయంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఒడ్డుకు చేరిన వెంటనే స్థానికులు మంటలు వేసి చలికాయించి, భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం వారిని కళింగపట్నం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా సరిహద్దు దాటి మనం దేశంలోకి వచ్చిన బంగ్లాదేశ్ మత్స్యకారులపై చట్టప్రకా రం కేసు నమోదుచేస్తామని మెరైన్ సీఐ తెలియ జేశారు. 2008లో కూడా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం సముద్రతీరానికి బంగ్లాదేశ్ మత్స్యకారులు తప్పిపోయి కొట్టుకొచ్చారు.

నేషనల్ హెరాల్డ్ కేసులో

## రాహుల్, సోనియాపై కొత్త ఎఫ్ఐఆర్



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** నేషనల్ హెరాల్డ్ కేసులో దిల్లీ ఈవోడబ్ల్యూ కాంగ్రెస్ అగ్రనేతలపై సహా మరికొందరిపై కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇచ్చిన సమాచారంతో ఎఫ్ఐఆర్‌లో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు మరో ఆరుగురిపై నేరపూరిత కుట్ర అభియోగాలు నమోదు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కేసులో కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్, సుమన్ దూబే, శ్యామ్ పిట్రోడాల తోపాటు యంగ్ ఇండియా సంస్థ కూడా కుట్ర, మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఈడీ ఆరోపిస్తోంది. వీరందరూ కుట్రపూరితంగా కేవలం రూ.50 లక్షలు మాత్రమే చెల్లించి..

- మిగతా 2లో

గత అనుభవాల పాఠాలతో

## భవిష్యత్తు ప్రణాళికలు

**సచివాలయంలో సీఎం, మంత్రులు మీడియా సమావేశంలో తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** గత అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలతో భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో సీఎం, మంత్రులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. అద్భుత పాలసీని జాతికి అంకితం చేస్తున్నట్టు చెప్పారు. బలమైన ఆర్థిక రాష్ట్రంగా నిలదొక్కుకునేందుకు విజన్ డాక్యుమెంట్ తయారు చేసినట్టు పేర్కొన్నారు. "విజన్ డాక్యుమెంట్ 2047లో విజన్, స్ట్రాటజీ.. రెండు ప్రధాన అంశాలు. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి పారదర్శక పాలసీలు ఉండాలి. పాలసీలకు పెరాలసిస్ వస్తే పెట్టుబడులకు రక్షణ లేకుండా పోతుంది. ఐఎస్‌బీ, నీతి ఆయోగ్ సంస్థల సహకారంతోపాటు విజన్ డాక్యుమెంట్ తయారీలో లక్షలాది మందిని భాగస్వాములను చేస్తున్నాం. ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టాం. నెట్ జీరో సిటీ, కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్‌ను మార్చాలి. కోర్ అర్బన్ రీజియన్‌ను సర్వీస్ సెక్టార్‌గా మారుస్తున్నాం. తెలంగాణ అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తాం. కొత్తగా క్యూర్, ప్యూర్, రేర్ పాలసీలు తీసుకువస్తున్నాం. ఆదాయం పెంచి.. పేదలకు పంచే విధానంతో బలమైన ఆర్థిక వ్యవస్థను తయారు చేస్తాం. 2034 నాటికి ఒక ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం. భారత ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ నుంచి 5శాతం అందిస్తున్నాం. దీన్ని 10 శాతానికి పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. గ్రీన్ ఫీల్డ్ హైవేలు, బుల్లెట్ రైళ్ల కోసం కేంద్రాన్ని ఒప్పిస్తున్నాం. తెలంగాణకు మరో 4 విమానాశ్రయాలు తీసుకొస్తున్నాం. వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, రామగుండంలో ఎయిర్‌పోర్టులు ఏర్పాటు కానున్నాయి. హైదరాబాద్-మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం కేంద్రంతో అంగీకారం కుదిరింది. హైవేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టు కనెక్టివిటీ ద్వారా పెట్టుబడులు ఆకర్షిస్తాం" అని సీఎం తెలిపారు.

## అవినీతి ఆరోపణలు..

**క్షమాభిక్ష కోరిన నెతన్యాహు**



**విశ్వం వాయిస్ న్యూస్ :** అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు .. తనకు క్షమాభిక్ష ప్రసాదించాలని కోరుతూ అధ్యక్షుడు ఐజక్ హెర్జోగ్‌కు అధికారికంగా విజ్ఞప్తి చేశారు. ప్రధాని కార్యాలయం ఈ విషయాన్ని వెల్లడించింది. క్షమాభిక్ష కోసం ఆయన అధ్యక్ష కార్యాలయం న్యాయ విభాగానికి తన అభ్యర్థనను సమర్పించినట్లు తెలిపింది. మరోవైపు.. అధ్యక్ష కార్యాలయం దీనిని అసాధారణ అభ్యర్థనగా పేర్కొంది. ఇది అనేక చిక్కులతో ముడిపడి ఉందని తెలిపింది. నెతన్యాహు మూడు వేర్వేరు కేసుల్లో మోసం, నమ్మకద్రోహం, లంచాలు స్వీకరించడం వంటి అభియోగాలు ఎదుర్కొంటున్నారు. ఇజ్రాయెల్ చరిత్రలో విచారణకు హాజరైన ఏకైక ప్రధాన మంత్రిగా నిలిచారు. సంపన్న రాజకీయ మద్దతుదారులకు ఆయన అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే.. ఇంకా ఏ కేసులోనూ దోషిగా తేలలేదు. ఆయన కూడా మొదటినుంచి ఆరోపణలను ఖండిస్తూ వస్తున్నారు. నెతన్యాహును క్షమించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్‌ను కోరిన వారాల

- మిగతా 2లో

తీవ్రవాయుగుండంగా

## బలహీనపడిన దిత్వా తుపాను



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక తీరంలో దిత్వా తుపాను ఉత్తర వాయవ్య దిశగా కదిలి తీవ్ర వాయుగుండంగా బలహీనపడిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. సోమవారం ఉదయానికి వాయుగుండంగా బలహీనపడే అవకాశముందని పేర్కొన్నారు. దిత్వా తుపాను గడిచిన 6 గంటల్లో గంటకు 5 కి.మీ వేగంతో కదిలి బలహీనపడింది. సముద్రం అలజడిగా ఉంటుందని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. సోమవారం దక్షిణకోస్తా తీరం వెంబడి గంటకు 45-65 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. సోమవారం నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలకు అవకాశం ఉంది. కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశం ఉందన్నారు. బాపట్ల, పల్నాడు, ప్రకాశం, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అంచనా వేసింది. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# ఏపీని టెన్షన్ పెడుతున్న దిత్వా తుఫాన్



శ్రీలంకను దాటి చెన్నైని మించి ఏపీ వైపుగా దిత్వా తుఫాన్ దూసుకుని వస్తోంది. దీని ప్రభావంతో దక్షిణాంధ్ర అంతటా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఇక ఉత్తరాంధ్రలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదు అవుతాయని చెబుతోంది. దిత్వా తుపాను కారణంగా సోమవారం నుంచి రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలో ఉన్న పలు ప్రాంతాలలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ప్రస్తుతం అయితే శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. అలాగే ప్రకాశం, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉంది. అదే మాదిరిగా అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల, పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు.

ఇదీ పరిస్థితి :

ఇదిలా ఉంటే దిత్వా తుఫాను గంటకు 12 కిలోమీటర్ల వేగంతో నైరుతి బంగాళాఖాతం దానిని ఆనుకుని ఉన్న ఉత్తర తమిళనాడు పుదుచ్చేరి తీర ప్రాంతాల్లో దాదాపు ఉత్తరం వైపుకు కదులుతోంది ఇది చెన్నైకి దక్షిణ ఆగ్నేయంగా 180 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఉత్తర తమిళనాడు పుదుచ్చేరి తీరాల నుండి తుఫాను కేంద్రం దాదాపు 70 కిలోమీటర్ల దూరంలో ఉందని వాతావరణ అధికారులు చెబుతున్నారు. ఇది రాబోయే 24 గంటల్లో ఉత్తర తమిళనాడు పుదుచ్చేరి తీరాలకు సమాంతరంగా తుపాను కదులుతూ తుపాను తీవ్ర వాయుగుండంగా బలహీనపడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

తీరాన్ని తాకకుండానే : అయితే దిత్వా తుఫాన్ తీరాన్ని తాకకుండానే నైరుతి బంగాళాఖాతంలోనే బలహీనపడవచ్చు అని అంటున్నారు దాంతో తీరం తాకితే ఏర్పడే విధ్వంసం ముప్పు అయితే లేనట్లే. కానీ ఇది బలంగా ముందుకు సాగుతూ తన ప్రభావాన్ని చూపిస్తున్నంత సేపూ మాత్రం తమిళనాడు ఏపీలోని దక్షిణ కోస్తా జిల్లాలకు అలాగే రాయలసీమ జిల్లాలకు ముప్పు పొంచి ఉందని అంటున్నారు. అలెర్ట్ గా ఉండాల్సిందే : దిత్వా తుపాను తీవ్రత నేపథ్యంలో రాష్ట్ర హోంమంత్రి అనిత అమరావతి సచివాల యంలో ఆర్టీజీఎస్ నుండి సమీక్షిం చారు. నెల్లూరు, తిరుపతి, కడప, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లతో హోంమంత్రి వీడియో కాన్ఫరెన్స్ సైతం నిర్వహించారు. రానున్న ఇరవై నాలుగు గంటల పాటు అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రజలను ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేసి అప్రమత్తం చేయాలన్నారు. ఎవరికీ ఏ విధమైన ప్రాణ నష్టం లేకుండా చూడటం న అందరి బాధ్యత అని హోంమంత్రి స్పష్టం చేశారు.

పునరావాసానికి : అదే విధంగా కంట్రోల్ రూమ్‌కు వచ్చే ప్రతి కాల్‌కు వెంటనే స్పందించాలని ఆమె సూచించారు. ప్రమాద ప్రదేశాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆయా ప్రాంతాల్లో అధికారులని నియమించాలని ఆదేశించారు. రోడ్లపై పడిన చెట్టు కొమ్మలు, హోర్డింగ్స్ వంటి అడ్డంకులను వెంటనే తొలగించే చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ అంతరాయం చోటుచేసుకుంటే వెంటనే పునరుద్ధరణ చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు ఇప్పటికే అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నట్టు హోంమంత్రికి నివేదించారు. అవసరమైతే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు కూడా చేయాలని ఆమె కోరారు.

# రాజధానిని రాజకీయం చేయడమేనా.. షర్మిల గారూ?!

ఏపీ రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలని.. దీనిని ఒక సాధారణ మునిసిపల్ స్థాయికి పరిమితం చేయరాదని సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం నిర్ణయించుకున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే రైతుల నుంచి సేకరించిన 33 వేల ఎకరాలకు తోడు మరో 46 వేల ఎకరాలను సేకరించాలని నిర్ణయించారు. తద్వారా భూమి పెరిగి.. పెట్టుబడులు, కేంద్ర సంస్థలు, స్థానిక, ఇతర ప్రాంతాల వారికి నివాసాలు.. అదేసమయంలో విమానాశ్రయం సహా ఇతర నిర్మాణాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించి రాజధాని ప్రాంత అభివృద్ధి అథారిటీ(సీఆర్ డీఏ) పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది.

అయితే.. దీనిని తప్పుబడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఏపీ చీఫ్ వైఎస్ షర్మిల తాజాగా మీడియా ముందుకు వచ్చారు. సీఎం చంద్రబాబుకు పలు ప్రశ్నలు సంధించారు. వాస్తవానికి ఆమె అడగాలని అనుకుంటే.. సీఎం చంద్రబాబును కలిసి వినతి పత్రాన్ని ఇవ్వొచ్చు. లేదా సీఆర్ డీఏ అధికారులను కలిసి వివరాలు కోరినా వారు చెబుతారు. కానీ, దీనికి భిన్నంగా రాజధానిపై రెండు గంటల పాటు మీడియా ముందు వ్యాఖ్యలు చేయడం.. రైతుల



పట్ల తీవ్రసానుభూతిని ప్రదర్శించడం వంటివి రాజకీయంలో భాగమేనన్న సందేహాలు వ్యక్తం చేస్తున్నారు పరిశీలకులు.

రాజధానికి తమ మద్దతు ఉంటుందని షర్మిల గతంలో ప్రకటించుకున్నారు. ఇక, ఆ పార్టీ అగ్రనేత కూడా.. తాము కేంద్రంలో అధికారంలోకి వస్తే.. రాజధాని అమరావతిని నిర్మించి తీరుతామని చెప్పారు. అయితే.. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు, రాష్ట్రాల్లోనూ రాజధానులను విస్తరిస్తున్నారు. ఒకప్పుడు చిన్నవిగా ఉన్న రాజధానులను ఇప్పుడు జనాభా పెరుగుదుల ప్రపంచ స్థాయి సౌకర్యాలు, అవసరాలను దృష్టిలో పెట్టుకుని విస్తరిస్తున్నారు. దీనికి భారీ ఎత్తున ఖర్చు చేస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే 25 సంవత్సరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు ఇప్పటి నుంచే రాజధాని విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఈ నేపథ్యంలోనే మరో 46 వేల ఎకరాల సమీకరణకు సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని రాజకీయం చేయడం ద్వారా రాజధానికి పరోక్షంగా షర్మిల మేలు కంటే కీడు ఎక్కువగాఉంటుందని పరిశీలకులు చెబుతున్నారు. రైతులను రెచ్చగొట్టడం ఆమె సాధించేది ఏమీ ఉండదని కూడా అంటున్నారు. తొలి విడతలో రైతులకు మేలు చేయలేదని.. ప్రస్తుతం మరోసారి భూములు తీసుకుంటున్నారని షర్మిల అన్నారు. కానీ.. తొలి విడతలో రైతులకు మేలు చేసే సమయానికి రాష్ట్రంలో ప్రభుత్వం మారిన విషయం తెలిసిందే. దీంతో మొత్తానికే ఇది నిలిచిపోయింది. కాబట్టి.. ఇప్పుడు మళ్లీ మొదటి నుంచి రాజధాని నిర్మాణాన్ని చేపట్టినట్టు అయింది. ఈ విషయాలు తెలిసి కూడా రాజధానిని రాజకీయంగా వాడుకునేందుకు షర్మిల ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

# పరమ మూర్ఖపు శిఖామణి ఎమ్మెల్సీ తోట...

**విలీనంపై ప్రజలను తప్పు ద్రోవ పట్టిస్తున్నారు - తూర్పుగోదావరిలో మండపేట విలీనం తథ్యం**

**పార్లమెంట్ స్థానం మార్పు కేంద్రం చేతిలో - అవగాహన రాహిత్యంగా మాట్లాడడం హాస్యాస్పదంగా ఉంది : ఎమ్మెల్యే వేగుళ్ళ**

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్** : పరమ మూర్ఖపు శిఖా మణిలా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వ్యవహారం ఉందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు దుయ్యబట్టారు. ఆనాడు 2024 ఎన్నికల ముందు వైసీపీ హయంలో పార్లమెంట్ పరిధిలో జిల్లాలు ఏర్పాటు చేస్తుంటే ఇక్కడి ప్రజలు మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న తూర్పు గోదావరి జిల్లా లో విలీనం చేయాలని ఆందోళన చేశారన్నారు. పార్లమెంట్ స్థానం మార్పు చేయాలని అనలేదని ఈ మాత్రం అవగాహన తోట త్రిమూర్తులకు లేకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలు ఎంపీగా అమలాపురం నుండి హరీశ్ మధుర్‌ను ఎన్నుకున్నారని ఆయన ఐదేళ్లు ఇక్కడికి ప్రజలకు ఎంపీ గా ఉంటారన్న జ్ఞానం లేకపోవడం విడ్డూరంగా వుందన్నారు. ఇది కూడా తెలియని చంటి పిల్లలు మాదిరి తోట వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. విలీనం పై తోట త్రిమూర్తులు ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారని విమర్శించారు. మండపేట నియోజకవర్గం తూర్పు గోదావరి జిల్లా లో కలిపేశారని పేర్కొన్నారు. నెల రోజులు తర్వాత ఫైనల్ గెజిట్ విడుదల కానుందన్నారు. పార్లమెంట్ మార్పు కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉందని 2028 నియోజకవర్గాల పునర్విభజనలో మార్పులు ఉంటాయన్నారు. గతంలో పశ్చిమ గోదావరి జిల్లాలో ఉండే కొవ్వూరు నియోజకవర్గం రాజమండ్రి పార్లమెంట్ స్థానం లో ఉండేదన్నారు. ఉమ్మడి తూర్పు జిల్లా లో అపుడు ఉన్న రంపచోడవరం అరకు పార్లమెంట్ లో ఉండేదని గుర్తు చేశారు. పరిపాలన పరంగా ఇక్కడి ప్రజలు తూర్పు గోదావరి లో కలవాలని కోరారని తను



దాన్ని సాధించానని పేర్కొన్నారు. గొప్పల కోసం ప్రజల్ని పక్కదారి పట్టిస్తున్నారని తోట చెప్పడం హాస్యాస్పదంగా వుందన్నారు. మండపేట నియోజక వర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో కలుపుతున్నాం అని చెబుతున్నాం తప్ప, అమలాపురం పార్లమెంట్ లో తీసేస్తున్నామని ఎక్కడ చెప్పలేదని వివరించారు. కుక్క తోక వంకర సామెత లా తోక వంకర పోదన్నారు. అచ్చం తోట త్రిమూర్తులు బుద్ధి కూడా మారదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇదే విషయం నియోజక వర్గ ప్రజలకు తెటల్లం అయిందన్నారు. వైసీపీ హయంలో పార్లమెంట్ పరిధి నీ జిల్లా గా ఏర్పాటు చేశారని తోట అన్నారని ఆయన ఎక్కడ ఉన్నారని ఈ రాష్ట్రంలో ఉంటున్నారా లేదా కళ్ళు కనిపించడం లేదా అంటూ ప్రశ్నించారు. నాలుగు సార్లు ఎమ్మెల్యే ఉన్నారని కాజులూరు మండలం ఎక్కడ ఉందో తెలుసా అంటూ నిలదీశారు. కాజులూరు మండలం కాకినాడ జిల్లా లో ఉన్న విషయం గుర్తుకు లేదా అని ప్రశ్నించారు. తోట సెటిల్మెంట్ ల కోసం, దోపిడి కోసం నియోజకవర్గాన్ని అన్యాయం చేశారని తము అనలేదని పేర్కొన్నారు. అమలాపురం లో వున్న గుండా బ్యాచ్ లను పోషించుకోవడం కోసం మండపేట ను కోనసీమ జిల్లా లో తోట త్రిమూర్తులు కలిపారని ఆరోపించారు. ఇదే అంశాన్ని గౌరవం కోసం తానెప్పుడూ లేవనెత్తలేదని ఇంకా మార్పు రాలేదని ఏమిటి తోట బాణీ అని తీవ్ర స్థాయి లో విమర్శించారు. ఆనాడు మండపేట తూర్పు లో విలీనం చేయాలంటే తోట త్రిమూర్తులు రామచంద్రపురం జిల్లా చేయాలనే ప్రతిపాదన చేశారని గుర్తు చేశారు. అమలాపురం అంటే తనకు కోపం లేదని స్పష్టం చేశారు. గోదావరి దాటి 65 కిలోమీటరు వెళ్ళాలి అని తము చెప్పమని పేర్కొన్నారు. రామచంద్రపురం జిల్లా ప్రతిపాదన జరగనిది ఎందుకు లేవనెత్తారని ప్రశ్నించారు. మండపేట నియోజకవర్గ ప్రజలు ఆలోచన చేయాలని తోట ఎలా మాట్లాడుతున్నాడో గమనించాలని ఇవాళ్టి కి కూడా ఆయన బుద్ధి మారలేదని విమర్శించారు. మండపేట ను రాజమహేంద్రవరం కేంద్రం గా ఉన్న తూర్పు గోదావరి జిల్లా లో విలీనం చేయడం తోట కు ఇష్టమా కదా ముక్కుసూటిగా చెప్పాలని డిమాండ్ చేశారు. కౌన్సిల్ సమావేశం లో ఆమోదిస్తున్నాం హర్షం తెలుపుతున్నాం అభినందిస్తున్నాం అని చెప్పి కార్యాలయం కు వెళ్లి మరో లా ప్రకటన చేయడాన్ని తప్పుబట్టారు. వున్న వాస్తవమే తము చెబుతున్నామని, గొప్పలు చెప్పడం లేదని పేర్కొన్నారు. ఆనాడు తోట త్రిమూర్తులు స్వార్థం తోనే పోరాటాలు లెక్క చేయకుండా కోనసీమ లో కలిపారని ధ్వజమెత్తారు. పక్కనే ఉన్న అనపర్తి నియోజకవర్గం లోని పెదపూడి మండలాన్ని అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి కాకినాడ జిల్లా లో కలిపిన విషయాన్ని గుర్తు చేశారు. ముమ్మిడివరం అప్పటి ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ తాళ్ళరేవు ను కాకినాడ జిల్లా లో కలిపారన్నారు. జగ్గంపేట లోని గోకవరం ను రాజమండ్రి లో కలిపారన్నారు. అప్పటి మంత్రి చెల్లుబోయిన వేణు తోట సొంత నియోజకవర్గం రామచంద్రపురం లో వున్న కాజలూరు మండలాన్ని కాకినాడ లో కలిపారన్నారు. అప్పటి వైఎస్ఆర్ ఎమ్మెల్యేలు ఏమి అడిగితే ఆ ప్రభుత్వం ఆవేళ చేసిందన్నారు. ఆనాడు తోట తన సొంత నియోజకవర్గం మండపేట కాదని ఉద్దేశ్యంతో ఇక్కడి ప్రజలను ఇబ్బంది పెట్టాలని వద్దు అన్నా కోనసీమలో కలిపారని ఆరోపించారు. ఇపుడు ఐదేళ్ల తర్వాత విముక్తి కలుగుతుంటే భరించలేక విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మండపేట నియోజక వర్గ ప్రజలు తోట త్రిమూర్తులు ధోరణి గమనించి నియోజకవర్గం నుండి పిచ్చి కుక్కను తరిమి కొట్టినట్లు తరిమి కొట్టాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు నల్లమిల్లి వీర్రెడ్డి, టౌన్ టిడిపి అధ్యక్షులు మచ్చా నాగు, పిల్లా తాతలు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలను
# నిర్మూలించండి

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం రాత్రే రాయ్‌పూర్ చేరుకున్న ప్రధాని శనివారం సమావేశంలో పాల్గొన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ తపన్ కుమార్ డేకా, సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ తదితరులు సైతం ఈ సమావేశానికి హాజరయ్యారు. "రాయ్‌పూర్‌లో జరుగుతున్న డీజీపీ/ఐజీపీల సమావేశం తొలిరోజు భారతీయ భద్రతా వ్యవస్థకు సంబంధించిన వివిధ కోణాలపై చర్చ జరిగింది. ఈ రంగంలో అత్యుత్తమ ఆచరణల్ని గురించి పంచుకోడానికి ఇది అత్యుత్తమ వేదిక" అని ప్రధాని తన సోషల్ మీడియా సందేశంలో పేర్కొన్నారు. సదస్సును ప్రారంభించిన అమిత్‌షా మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం నక్సలిజం సమస్యకు, ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూకశ్మీర్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిందని ఆయన అన్నారు. కొత్త క్రిమినల్ చట్టాల సాయంతో దేశ వ్యాప్తంగా పోలీసు వ్యవస్థను ఆధునీకరించాలని ఆయన అన్నారు. రాష్ట్రాల పోలీసు బలగాలు మాదక ద్రవ్యాల నియంత్రణ బోర్డు (ఎన్‌సీబీ)తో కలిసి పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందని షా అన్నారు. సదస్సు ఆదివారం ముగియనుంది. ముగింపు సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగిస్తారు. పోలీసుల పనిలో తలెత్తుతున్న సవాళ్లను ఆయన సమీక్షించనున్నారు. 2013 వరకూ ఈ సమావేశం దిల్లీలోనే జరిగేది. అయితే మోదీ 2014లో పగ్గాలు చేపట్టాక దీన్ని జాతీయ రాజధానికి వెలుపల నిర్వహించాలని ఆదేశించారు. ఇప్పటి వరకూ ఈ సమావేశం గువాహటి, రాన్ ఆఫ్ కచ్(గుజరాత్), హైదరాబాద్, టెంకన్‌పూర్ (గ్వాలియర్, మధ్యప్రదేశ్), స్టాచూ ఆఫ్ యూనిటీ(కేవడియా, గుజరాత్), పుణె, లఖ్‌నవూ, జైపూర్, భువనేశ్వర్‌లలో నిర్వహించారు.

# డిజిటల్ అరెస్టు కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

గాలింపు చేపట్టారు. బాధితుడి నుంచి రూ.1.92 కోట్లు వీరు కాజేశారు. నవంబర్ 7–14 వరకు వివిధ బ్యాంకు ఖాతాల్లో బాధితుడు డబ్బు జమచేశాడు. సీబీఐ అధికారుల పేరిట బాధితుడికి ఫోన్ చేసి నిందితులు మోసగించారు. ఆధార్ దుర్వినియోగంతో కేసు నమోదైందంటూ బెదిరించారు.

# పరిశోధన రంగంలో భారత్ దూసుకుపోతోంది : మోదీ

(మొదటిపేజీ తరువాయి)

స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా, వంటి సంస్కరణలతో భారత యువత వికసిత్ భారత్ కలను సాకారం చేస్తారని తాను బలంగా విశ్వసిస్తున్నట్లు ప్రధాని వ్యాఖ్యానించారు. కొద్ది రోజుల క్రితం సోషల్ మీడియాలోని ఓ వీడియో తన దృష్టిని ఆకర్షించిందన్నారు. అందులో అంగారక గ్రహంపై ఉన్న వాతావరణ పరిస్థితులను కృత్రిమంగా రూపొందించిన చోట డ్రోన్లను ఎగరవేయడానికి మన యువత ప్రయత్నించారన్నారు. వాటికి జీపీఎస్ మద్దతు లేకపోవడం వల్ల డ్రోన్లు నేలకూలుతున్నప్పటికీ.. పుణెకు చెందిన విద్యార్థుల బృందం పట్టుదలతో పలుమార్లు యత్నించి డ్రోన్లు కొంత సమయం ఎగిరేలా చేసినట్లు వెల్లడించారు. యువతలో ఉన్న ఇటువంటి గొప్ప సంకల్ప బలమే దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చేందుకు తోడ్పడుతుందన్నారు.

## నేషనల్ హెరాల్డ్ కేసులో
# రాహుల్, సోనియాపై కొత్త ఎఫ్ఐఆర్

(మొదటిపేజీ తరువాయి)

అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.2వేల కోట్ల విలువైన ఆసులపై అధికారాన్ని పొందారని ఆరోపించింది. కాగా మోతీలాల్ వోరా 2020లో మృతిచెందగా.. ఆస్కార్ ఫెర్నాండెజ్ 2021లో మృతిచెందారు. నేషనల్ హెరాల్డ్ పత్రికను ప్రచురిస్తున్న అసోసియేటెడ్ జర్నలిస్ట్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు కాంగ్రెస్ పార్టీ రూ.90 కోట్ల రుణం అందించి దాని ఆస్తుల్ని ఆధీనంలోకి తీసుకోగా.. రాహుల్, సోనియాకు మెజార్టీ వాటా ఉన్న యంగ్ ఇండియా రూ.50 లక్షలు మాత్రమే కాంగ్రెస్ పార్టీకి చెల్లించి ఏజేఎల్‌ను సొంతం చేసుకొన్నట్లు అభియోగపత్రంలో ఈడీ పేర్కొంది. ఎన్నికల్లో పార్టీ టికెట్లు కేటాయిస్తామని, పదవులకు ఎంపికచేస్తామని, వ్యాపారాలకు రక్షణ కల్పిస్తామంటూ వివిధ వ్యక్తుల నుంచి పార్టీ సీనియర్ నేతల ద్వారా అక్రమార్జనకు పాల్పడ్డారని తెలిపింది.

# అవినీతి ఆరోపణలు..

(మొదటిపేజీ తరువాయి)

వ్యవధిలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

**బైడెన్ ఆటోపెన్ ఆదేశాలు రద్దు చేసిన ట్రంప్**

"నాపై విచారణ విషయంలో దేశం ముక్కలుగా విడిపోయింది. క్షమాభిక్ష ప్రసాదిస్తే.. దేశ ఐక్యత పునరుద్ధరణకు తోడ్పడుతాను. అదేవిధంగా వారానికి మూడుసార్లు కోర్టుకు హాజరు కావాలనే నిబంధన అనేది.. దేశ వ్యవహారాల నిర్వహణలో ఆటంకం కలిగిస్తుంది" అని నెతన్యాహు పేర్కొన్నారు. ఆయన అభ్యర్థనను తొలుత న్యాయశాఖకు అభిప్రాయం కోసం పంపుతారు. అక్కడి నుంచి అధ్యక్ష కార్యాలయంలోని న్యాయ సలహాదారుకు బదిలీ అవుతుంది. అనంతరం అధ్యక్షుడి వద్దకు చేరుతుంది.

## జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని
# రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) రాహుల్ మీనా ఆదేశాల మేరకు, జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లను స్టేషన్లకు పిలిపించి వారికి ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

**కౌన్సిలింగ్ ముఖ్య ఉద్దేశాలు:**

**శాంతిభద్రతల పరిరక్షణ:** జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా నిరోధించడం.

**మార్గనిర్దేశం:** రౌడీ షీటర్లు పాత నేర చరిత్రను విడిచిపెట్టి, మంచి జీవనం గడిపేలా వారికి మార్గనిర్దేశం చేయడం.

**హెచ్చరిక:** చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే, కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంగా హెచ్చరించడం.

**జీవనోపాధి:** నేరాలకు దూరంగా ఉంటూ గౌరవప్రదమైన జీవనోపాధిని ఎంచుకోవాలని వారికి సూచించడం. ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ మాట్లాడుతూ, "జిల్లాలో ఎలాంటి అసాంఘీక శక్తులు, రౌడీయిజం, గూండాయిజంలకు తావు లేకుండా చూస్తాము. నేరాలకు పాల్పడే వారిపై, పాత నేరాలను పునరావృతం చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోము. ఈ కౌన్సిలింగ్ ద్వారా వారు తమ ప్రవర్తనను మార్చుకుంటారని ఆశిస్తున్నాము," అని తెలిపారు.

# విశ్వ వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

సోమవారం, 01 డిసెంబర్ 2025




www.viswamvoice.com

# విశాఖలో అకీరా నందన్ స్పెషల్ అట్రాక్షన్..

## అసలు ఎందుకొచ్చాడో తెలుసా..?



విశాఖలో తూర్పు ప్రాంత నావికాదళ కమాండ్ ఏర్పాటు చేసిన సర్గమ్ - 2025 ఇండియన్ నేవల్ సింఫనిక్ ఆర్కెస్ట్రా కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అయితే ఆయన వెంట కుమారుడు అకీరా నందన్ కూడా ఉండటమే ఎక్కువ ఆసక్తి రేపింది. డిసెంబరు 4న నేవీ డే ఉత్సవాలు జరగనున్నాయి. దీనికి ముందస్తుగా సర్గమ్ ఈవెంట్ ను నిర్వహిస్తుంటారు. ఈ ఈవెంటు సందర్భంగా తూర్పు ప్రాంత నావికాదళ సింఫనిక్ బ్యాండ్ చేసిన సంగీత విన్యాసాలు వీనుల విందు చేశాయి. అధికారిక హెూదాలో పవన్ ఈ కార్యక్రమానికి హాజరైనా.. వెంట అకీరా నందన్ రావడమే ఎక్కువ చర్చకు దారితీసింది. పవన్ కుమారుడైన అకీరా సినీ రంగ ప్రవేశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. పవన్ ఉప ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయనతో పలుమార్లు అకీరా నందన్ కనిపించాడు. అయితే నేవల్ ఉత్సవాలకు ఆయన రావడం వెనుక అకీరాకు ఉన్న సంగీతంపై ఆసక్తి ప్రధాన కారణం అంటున్నారు. అకీరా చూడటానికి హీరో మెటీరియల్ గా కనిపించినప్పటికీ ఆయనకు సంగీతంపై ఎక్కువ అంటూ ప్రచారం ఉంది. కీబోర్డ్ ప్లే చేయడంలో అకీరా మంచి ప్రతిభ కనబరుస్తాడని కూడా చెబుతుంటారు. మెగా ఫ్యామిలీ వేడుకల్లో చాలా సార్లు అకీరా మ్యూజిక్ ప్రదర్శనలతో అందరినీ మెప్పించాడని పవన్ అభిమానుల్లో టాక్ ఉంది. ఇక అకీరా తల్లి రేణు దేశాయ్ సైతం పలుమార్లు అతడి సంగీతాభిరుచిపై మీడియాకు తెలియజేశారు. అకీరా నందన్ తన తండ్రి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాదిరిగానే ప్రకృతిని ప్రేమిస్తాడని చెబుతున్నారు. అంతేకాకుండా నాచురల్ ఫుడ్ తీసుకోవడానికి ఇష్టపడతాడని, ఫిట్‌గా ఉండటానికి యోగా, మార్షల్ ఆర్ట్స్, ప్రాణాయామం కూడా చేస్తాడని ప్రచారం ఉంది. ఈ లక్షణాలు అన్నీ పవన్ కళ్యాణ్‌లో ఉన్నాయని ఆయన అభిమానులు చెబుతున్నారు. దీంతో అకీరా ఎక్కడ కనిపించినా అతడిలో పవన్ ను చూస్తూ ఆనందిస్తుంటారు. ఇక విశాఖ విమానాశ్రయంలో పవన్ తో అకీరా కనిపించగానే అభిమానులు గోలగోల చేశారు.

# కొత్త సీఎస్‌గా సాయిప్రసాద్..

## ఫిబ్రవరి వరకు విజయానంద్‌కు చాన్స్



ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పదవీ కాలాన్ని మరో మూడు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. డిసెంబరు 1వ తేదీ నుంచి 2026 ఫిబ్రవరి 28 వరకూ సీఎస్ పదవీకాలాన్ని పొడిగిస్తూ రాష్ట్ర సాధారణ పరిపాలనశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంతో ప్రభుత్వం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఇదే సమయంలో ఆయన రిటైర్మెంట్ తర్వాత కొత్త ప్రధాన కార్యదర్శిగా ప్రస్తత జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి జి.సాయిప్రసాద్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వచ్చే ఏడాది మార్చి 1న ఆయన సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. వాస్తవానికి నవంబరు 30న సీఎస్ విజయానంద్ పదవీ విరమణ చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఆయన పదవీ కాలాన్ని మరో మూడు మాసాలు పొడిగిస్తూ కేంద్ర డిపార్టుమెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డిఓపిటి) పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వచ్చే ఫిబ్రవరి 28వ తేదీ వరకు సీఎస్ విజయానంద్ పదవిలో కొనసాగుతారు. ఇక విజయానంద్ తర్వాత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అవుతున్న సాయిప్రసాద్ 1991 ఐఏఎస్ బ్యాచ్ అధికారి. 1992లో వరంగల్ జాయింట్ కలెక్టర్ గా కెరీర్ ప్రారంభించారు. ఉమ్మడి రాష్ట్రంలో వివిధ హెూదాల్లో పనిచేసిన ఆయన ప్రస్తుతం ముఖ్యమంత్రి ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. కొన్నాళ్లు కేంద్ర సర్వీసుల్లో కూడా సాయి ప్రసాద్ పనిచేశారు. ఇక కొత్త సీఎస్ కానున్న సాయిప్రసాద్ వచ్చే ఏడాది మే నెలలో పదవీ విరమణ చేయనున్నారు. అయితే ఆయన పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించే అవకాశం ఉందని అంటున్నారు. ఐఐటీ ఢిల్లీ నుంచి ఎంటెక్ గ్రాడ్యుయేట్ అయిన సాయిప్రసాద్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) చీఫ్ కమిషనరుగా ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ సీఎండీగా పనిచేశారు. ఏపీ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ హెూదాలోనూ కొన్నాళ్లు సేవలు అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు అత్యంత సన్నిహిత అధికారిగా సాయిప్రసాద్ ను చెబుతారు. కాగా, జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న అధికారులు తర్వాత సీఎస్ లుగా పదోన్నతులు పొందడం ఆసక్తి రేపుతోంది. గతంలో సీఎస్ లుగా పనిచేసిన ఆదిత్యనాథ్ దాస్, కేఎస్ జవహర్ రెడ్డి కూడా గతంలో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులుగా పనిచేస్తూ సీఎస్ లుగా పదోన్నతులు పొందారు. ప్రస్తుతం జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జి.సాయిప్రసాద్ తాజాగా సీఎసగా నియమితులయ్యారు. ఒకే శాఖ.. ఒకే గది.. నుంచి ముగ్గురు సీఎస్‌లు అయ్యారని ఐఏఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పుడు ఈ గది ప్రత్యేక సెంటిమెంట్‌గా మారుతుందేమోనని కొందరు ఐఏఎస్‌లు అంటున్నారు.

# ఫిర్యాదుదారే నిందితుడు..

## టీటీడీ నెయ్యి కేసులో ట్విస్టు! మరో 11 మందిపై కేసులు



తిరుమల కల్తీ నెయ్యి కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. డిసెంబరు 15లోగా సుప్రీంకోర్టులో చార్జిషీటు దాఖలు చేయాలన్న టార్గెట్ పెట్టుకున్న సీబీఐ సిట్ కేసు దర్యాప్తులో వేగం పెంచింది. ఇటీవల టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి విచారణ, ఆ తర్వాత అప్పటి ప్రొక్యూర్మెంట్ మేనేజర్ సుబ్రహ్మణ్యం అరెస్టు చేసింది. ఇక తాజాగా టీటీడీలో పనిచేస్తున్న మరో 11 మందికి ఈ కల్తీ వ్యవహారంలో భాగస్వామ్యం ఉందని సిట్ తేల్చింది. ఇందులో కేసు పెట్టిన ఫిర్యాదుదారు కూడా నిందితుడుగా ఆరోపణలు ఎదుర్కోవడం గమనార్హం. టీటీడీలో మొత్తం 12 మంది పాత్ర ఉన్నట్లు సిట్ తేల్చగా, ఇందులో అప్పటి జీఎం సుబ్రహ్మణ్యంను ఇప్పటికే అరెస్టు చేశారు. ఇక మిగిలిన 11 మందిలో ఆరుగురు టీటీడీ అదికారులు కాగా, మిగిలిన వారు టీటీడీ నియమించుకున్న డెయిరీ నిపుణులుగా చెబుతున్నారు. ఈ మొత్తం 11 మంది కల్తీ నెయ్యి వచ్చేందుకు సహకరించారని సిట్ దర్యాప్తులో తేలినట్లు చెబుతున్నారు. కాగా, నెయ్యి కల్తీపై ముఖ్యమంత్రి చంద్రబాబు బయటపెట్టిన వెంటనే, ఈ వ్యవహారంపై విచారణ జరపాలని పోలీసులకు ఫిర్యాదు చేసిన జీఎం మురళీకృష్ణ కూడా నిందితుడిగానే సిట్ తేల్చడం చర్చనీయాంశమైంది. కల్తీ నెయ్యి కేసులో ఏ25గా తిరుమల గోడౌన్ కీపర్ ఈశ్వరరెడ్డి, ఏ26గా ప్రొక్యూర్మెంట్ విభాగం పూర్వ సీనియర్ అసిస్టెంట్ అనిల్ కుమార్, ఏ27గా తిరుపతి గోడౌన్ ఇన్చార్జి వెంకటనటేశ్ బాబు, ఏ28గా పేరూరి జగదీశ్వరరెడ్డి, ఏ30గా ఫిర్యాదుదారు ప్రళయకావేరి మురళీకృష్ణ, ఏ31గా టీటీడీ గోశాల పూర్వపు డైరెక్టర్ హరినాథరెడ్డి, ఏ32 నుంచి ఏ36 వరకు టీటీడీ టెక్నికల్ ఇన్స్పెక్షన్ కమిటీ సభ్యులుగా నియమించిన డెయిరీ నిపుణులు మల్లం మహేందర్, వి.వెంకట సుబ్రహనియన్, ఎం.విజయభాస్కరరెడ్డి, బత్తుల సురేంద్రనాథ్, కె.జయరాజా రావులను గుర్తించారు. కాగా, నిందితుల్లో ఇద్దరు రిటైర్డ్ ఉద్యోగులు ఉండగా, మరొకరి పదవీకాలం నవంబరుతోనే పూర్తయింది. నిందితులు అంతా కలిసి టీటీడీకి నెయ్యి సరఫరా చేసే డెయిరీలతో కుమ్మక్కై లడ్డూ ప్రసాదంలో కల్తీకి కారణమయ్యారని సిట్ ఆరోపిస్తోంది. ప్రధానంగా టీటీడీకి నెయ్యి సరఫరా చేసే డెయిరీలు టెండర్లలో పాల్గొనేందుకు నిజంగానే అర్హత, సామర్థ్యం ఉందా అన్నది తెలుసుకునేందుకు ఆయా డెయిరీలను టెక్నికల్ టీమ్ తనిఖీ చేసి టీటీడీకి నివేదిక ఇవ్వాల్సివుంటుంది. అయితే టెక్నికల్ టీంలో ఉన్నవారు డెయిరీలను సందర్శించకుండానే తప్పుడు నివేదికలు ఇచ్చారని సిట్ అభియోగాలు మోపుతోంది. అదేవిధంగా ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యి కల్తీ అయిందని తెలిసి కూడా ఆ విషయం దాచిపెట్టినట్లు సిట్ చెబుతోంది. మైసూరులోని సీఎఫ్టీఆర్ఐ ల్యాబ్ వెజిటబుల్ ఆయిల్స్ తో నెయ్యి కల్తీ అయినట్లు గుర్తించి, ఆ రిపోర్టును టీటీడీకి పంపింది. దాన్ని పరిశీలించాల్సిన సురేంద్రనాథ్ అనే టీటీడీ డెయిరీ నిపుణుడు అన్ని పారామీటర్లు సక్రమంగా ఉన్నట్లు నివేదిక సమర్పించినట్లు సిట్ గుర్తించింది. ఇలా మొత్తం నిందితులు అంతా తమతమ స్థాయిల్లో సహకరించి శ్రీవారి ప్రసాదంలో కల్తీకి కారణమయ్యారని సిట్ తేల్చిందని అంటున్నారు.

# గుంతల రోడ్లకు కొత్త పరిష్కారం..

## రోటి తినేలోగానే రోడ్ల మరమ్మతులు పూర్తి!



గుంతల రహదారుల వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు సరిగా లేకపోవడం వల్ల వాహనాలు తరచూ అదుపు తప్పడం, ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది. ఏపీలో రోడ్ల మరమ్మతులకు కొత్త టెక్నాలజీని వాడుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఈ కొత్త సాంకేతికత వల్ల మంచి ఫలితాలు వచ్చినట్లు చెబుతున్నారు. దీంతో రాష్ట్రంలో సమస్యగా మారిన రోడ్ల గుంతలకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందని అంటున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి చాలావరకు రోడ్లు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రోడ్ల మరమ్మతులను పూర్తి చేయాలని ప్రజల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ వచ్చింది. గత ఏడాది రోడ్ల మరమ్మతులకు దాదాపు 800 కోట్ల రూపాయలను ప్రభుత్వం వెచ్చించింది. దీంతో కొన్ని రోడ్లు బాగుపడ్డాయని ప్రజలు ఉపిరిపీల్చుకోగానే మళ్లీ వర్షాకాలం రావడం, యథావిధిగా రోడ్లు గుంతలు పడటంతో కష్టాలు మొదటికి వస్తున్నాయి. దీంతో రోడ్ల గుంతలకు శాశ్వత పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. గుంతల రహదారుల వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు సరిగా లేకపోవడం వల్ల వాహనాలు తరచూ అదుపు తప్పడం, ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది. దీంతో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మరెందరో గాయపడుతున్నారు. దీంతో కలవరం చెందిన కేంద్ర రహదారి పరిశోధన సంస్థ (సీఆర్ఆర్ఐ) సీనియర్ ముఖ్య శాస్త్రవేత్త సతీష్ పాండే కొత్త టెక్నాలజీతో రోడ్ల గుంతలు పూడ్చే పద్ధతిని కనుగొన్నారు. దీనివల్ల రోడ్లపై గుంతలను నిమషాల్లోనే పూర్తి చేయొచ్చు. ఈ విధానం వల్ల త్వరగా పాడేయ్యే అవకాశం కూడా ఉండదని అంటున్నారు. ఎకోఫిక్స్ పేరుతో తీసుకువచ్చిన ఈ కొత్త టెక్నాలజీతో రోటి తినేలోగా రోడ్డు మరమ్మతులు పూర్తి చేయొచ్చని శాస్త్రవేత్త సతీష్ పాండే చెప్పారు. ఉక్కు వ్యర్థాలను ప్రాసెస్ చేసి తయారు చేసే ఎకోఫిక్స్ తో రోడ్లు ధ్రుడంగా తయారయ్యే అవకాశం ఉందంటున్నారు. స్టీల్ ప్లాంట్లలో వచ్చే వ్యర్థాలను ఉపయోగించి వెంటనే వాడగలిగే విధంగా ఈ ఎకోఫిక్స్‌ను డాక్టర్ సతీష్ పాండే తయారు చేశారు. ఉక్కు వ్యర్థాలను ప్రాసెస్ చేసి, వాటికి ఓ ప్రత్యేక పాలిమరిక్ బైండర్ను కలుపుతారు. దాంతో అది బాగా రోడ్డుకు అతుక్కుని, నీటిని తట్టుకుని, దీర్ఘ కాలం వరకు మన్నుతుంది. దీనికి అయ్యే ఖర్చు 10 నుంచి 20 శాతం తక్కువ, మన్నిక ఎక్కువని శాస్త్రవేత్త డాక్టర్ సతీష్ పాండే వివరించారు. కర్ణాటకలోని 141వ నంబరు రాష్ట్ర రహదారిపై గుంతలను ఎకోఫిక్స్‌తో విజయవంతంగా పూడ్చి చూపించారు. గుంతల్లో నీళ్లు తీయకుండానే రోడ్డుకు మరమ్మతులు చేసి వెంటనే ట్రాఫిక్ పునరుద్ధరించడంతో రాష్ట్ర ప్రభుత్వం సీఎస్ఐఆర్-సీఆర్ఆర్ఐతో ఒప్పందం కుదుర్చుకుంది. దేశ రాజధాని ఢిల్లీలో ఒకే రోజు 3,400 గుంతల్ని ఈ విధానంతో పూడ్చారు. ఇప్పటికే ఈ విధానాన్ని రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా చూపించారు. ఏపీలో ఆర్అండ్ బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో రాజధాని అమరావతి ప్రాంతంలో గుంతలను ఎకోఫిక్స్ తో పూడ్చిచూపించారు. ఈ క్రమంలో విశాఖ స్టీల్ ప్లాంటులో ఉన్న దాదాపు 20 నుంచి 30 టన్నుల వ్యర్థాలను దీనికి ఇచ్చేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చింది.

# అమరావతికి ఆర్బీఐ..

## మరో 25 బ్యాంకుల నిర్మాణానికి డేట్ ఫిక్స్




రాజధాని అమరావతిలో ప్రభుత్వ నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. వీటితోపాటు సమాంతరంగా ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు ప్రాజెక్టులు కూడా నిర్మాణాలకు ముందుకొస్తున్నాయి. ఇక తాజాగా జాతీయ బ్యాంకుల శంకుస్థాపనకు ముహూర్తం మళ్లీ ఫిక్స్ చేశారు. గత నెలలోనే ఈ కార్యక్రమం జరగాల్సివుండగా, మొంథా తుఫాన్ కారణంగా వాయిదా పడింది. ఇక ఇప్పుడు పరిస్థితులు అన్నీ అనుకూలంగా ఉండటంతో ఈ నెల 28న ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయంతోపాటు మరో 25 ప్రభుత్వ ప్రైవేటు రంగ బ్యాంకుల శంకుస్థాపనకు ముహూర్తం నిర్ణయించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతామారన్ చేతుల మీదుగా ఈ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అమరావతి పరిధిలోని నేలపాడులో ఆర్బీఐకి కేటాయించిన 3 ఎకరాల స్థలంలో ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాన్ని నిర్మించనున్నారు. గత నెల 28న ఈ భవన నిర్మాణానికి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శంకుస్థాపన చేయాల్సివుంది. అప్పట్లో తుఫాన్ ఏర్పడటంతో రద్దు చేశారు. ఇప్పుడు కూడా అదే తేదీన అంటే నవంబరు 28న శంకుస్థాపనకు ముహూర్తం కుదరడం గమనార్హం. ఆర్థిక మంత్రి నిర్మలమ్మ టూర్ ఖరారు చేస్తూ షెడ్యూల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఆర్డీఏ ప్రాంగణంలో భారీ బహిరంగ సభ నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరుకానున్నారు. అదేవిధంగా రాష్ట్రానికి చెందిన ముగ్గురు కేంద్ర మంత్రులను ఈ కార్యక్రమానికి అతిథులుగా ఆహ్వానిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి 2.0 పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రధాని మోదీ చేతుల మీదుగా మే నెలలో పనులను పునఃప్రారంభించిన తర్వాత నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. గతంలో సగం వరకు నిర్మించి మధ్యలో నిలిచిపోయిన పనులు అన్నీ పూర్తయ్యాయి. సీఆర్డీఏ పరిపాలన భవనం ఇప్పటికే ప్రారంభమైంది. మరోవైపు హెూటళ్లు, విద్యాసంస్థల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. రోడ్లు, గ్రావిటీ కెనాల్స్, డ్రైనేజీల నిర్మాణ పనులు విరామం లేకుండా చేపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే అమరావతిలో 25 జాతీయ, ప్రైవేటు బ్యాంకుల రాష్ట్ర కార్యాలయాలు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సిద్ధమయ్యాయి. నిజానికి 2014-19 మధ్య కాలంలోనే 12 జాతీయ బ్యాంకులకు రాజధాని అమరావతిలో భూములు కేటాయించారు. అమరావతిలోని ఉద్దండరాయునిపాలెం వద్ద బ్యాంకులు అన్నింటికి పక్కపక్కనే భూమిలిచ్చారు. చంద్రబాబు 3.0లో భవన నిర్మాణాలకు ముందుకొచ్చిన బ్యాంకులు.. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత వెనక్కి తగ్గాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్ మూడు రాజధానుల ప్రతిపాదన చేయడంతో జాతీయ బ్యాంకులు కూడా భూములను స్వాధీనం చేసుకోలేకపోయాయి. ఇక గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బ్యాంకులతో సంప్రదింపులు మళ్లీ మొదలయ్యాయి. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా అమరావతి నిర్మాణంపై శ్రద్ధ తీసుకోవడంతో జాతీయ బ్యాంకుల యాజమాన్యాలు అన్నీ ఒకేసారి శంకుస్థాపనకు నిర్ణయించాయి. అయితే మొంథా తుఫాన్ కారణంగా గత నెలలో ప్రభుత్వం శంకుస్థాపన కార్యక్రమాన్ని వాయిదా వేసింది. రాజధాని ప్రాంతంలో బ్యాంకులు అన్నీ ఒకేచోట నిర్మించనుండటం వల్ల ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందని అంటున్నారు. అమరావతిలో నిర్మాణం జరగనున్న బ్యాంకుల్లో ఎస్బీఐకి 3 ఎకరాలు కేటాయించారు. ఇందులో 14 అంతస్థుల్లో ఎస్బీఐ రాష్ట్ర కార్యాలయాన్ని నిర్మించనుంది. అదేవిధంగా కెనరా బ్యాంకు, యూనియన్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంకు, ఏపీ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ఉద్దండరాయుని పాలెంలో ప్రధాన కార్యాలయాలను నిర్మించనున్నాయి.

# పవన్ మాటలు వేరు.. చేతలు శూన్యం...

## ప్రతి ఆంధ్రుడు మనసులో మాటగా వుంది.. : ఆర్పీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్

**రాజమహేంద్రవరం విశ్వం వాయిస్ న్యూస్ :** ఉచిత పథకాలు పచ్చి మోసం అంటు చంద్రబాబు కూటమిని నేరుగా పవన్ కళ్యాణ్ విమర్శిస్తున్నారా..! అని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టి వారాంతపు సమావేశంలో ఆర్పీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ సందేహం వ్యక్త పరిచారు. మేడా శ్రీనివాస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లె వెలుగు 2.0 సభలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ తన అభిమానులుగా చెప్పుకుంటున్న వారికి ఒక నాయుకిడిగా బోధించాల్సింది పోయి అభిమానులను మిలిటంట్లుగా పోల్చుకోవటం, మిలిటంట్లుగా తయారు కావండి.మీరు అంటే భయం, దడ ,మీ గుణ ఘణాలే నన్ను ఇంతటి వాడిని చేసాయి అంటు తన అభిమానులను, కొంతమంది యువతను రెచ్చగొట్టే విధంగా ఉపన్యాసాలు చేయటం పవన్ కళ్యాణ్ కే చేలుతుంది.ఒక నాయకుడిగా సమాజం గర్వపడే విధంగా , తల్లిదండ్రులను ఆనంద పరిచే విధంగాను, దేశమే అబ్బుర పడే విధంగా యువత వుండాలి. తన అభిమానులుగా చెప్పుకుంటున్న వారు ఆలా బ్రతకాలి అని చెప్పకుండా మీ అల్లరి,మీలో ఒక రకమైన వికృత ధోరణి రాజకీయ ప్రత్యేర్థులను భయబ్రాతులకు గురించేస్తుంది.తన అభిమానులు పడే గొడవలు మిలిటెంట్ విధానాలను తలపిస్తున్నట్టుగా ఉంటుందని పవన్ కళ్యాణ్ నేరుగా తన అభిమానులను ఉద్దేశిస్తు ఉపన్యాసాలు గుప్పిస్తుంటే యువతను, తన అభిమానులను బాగుపడమనా లేక మిలిటెంట్ల వలే సంఘ విద్రోహులుగా మారమనా ! పవన్ కళ్యాణ్ మాటల్లో అంతర్గతం తెలియటం లేదని ఆయన ఆవేదన చెందారు. పవన్ కళ్యాణ్ ఉపన్యాసాల్లో తన అభిమానుల తాటికి సాక్షాత్తు ప్రధానమంత్రి ప్రత్యేక భద్రతా దళాలు భయపడుతున్నాయట. వాళ్ళు కాశ్మీర్ లో విధులు నిర్వహించటానికి భయపడరట ఆంధ్రప్రదేశ్‌లో పవన్ అభిమానులకు ప్రధానమంత్రి భద్రతా దళాలు భయపడుతు న్నాయని భహిరంగంగా పవన్ కళ్యాణ్ ఉపన్యాసాల్లో చెప్పుకోవటం బాదాకరం . పవన్ తన స్థాయిని పెంచుకోవటానికి ప్రధానమంత్రి ప్రత్యేక భద్రతా దళాలను సైతం వాడేసుకోవటంను పిఎమ్ఓ కార్యాలయం సీరియస్‌గా తీసుకోవాలి. లేకుంటే భవిష్యత్ లో కొంతమంది పవన్ కళ్యాణ్ మాదిరి ప్రధానమంత్రి ఎవడి బడితే వాడికి కూడా భయపడుతున్నారు అనే గాసిప్స్ ను ప్రచారాస్త్రంగా మార్చుకునే ప్రమాదం వుంది. పవన్ కళ్యాణ్ పిఎమ్ భద్రతా దళాలను అవమానించే విధంగా మాట్లాడటం చట్ట వ్యతిరేక చర్యగా బావించాలి. పవన్ కళ్యాణ్ జాతికి క్షమాపణ



చెప్పాలి.ప్రధానమంత్రి భద్రతా దళాలకు పవన్ కళ్యాణ్ కోసం తెలవక పోయినా ఆశ్చర్యం లేదు . వాళ్ళ ధ్యాస మొత్తం ప్రధాని వ్యక్తిగత భద్రత పైనే ఉంటుంది.పవన్ కళ్యాణ్ అబద్దాలకు ప్రధాని భద్రతా దళాలను కూడా వాడేసుకుకోవటం గమనిస్తున్న ఆంధ్రులకు పవన్ చేష్టలపై అసహ్యం పుడుతుందని ఆయన అపహాస్యం చేసారు. పవన్ కళ్యాణ్‌కు కేంద్ర నిఘా వర్గాలు సమాచారం ఇచ్చేస్తుంటాయి.ప్రధాని భద్రతా దళాలు భయపడు తుంటాయి.ఆంధ్రప్రదేశ్‌లో 30 వేల పైబడి అమ్మాయిలు కనిపించ కుండా పోయారు. ఆ సమాచారం పవన్ కు చెప్పింది కేంద్ర నిఘా సంస్థలు అని పవన్ కళ్యాణ్ స్వయంగా చెప్పుకున్నారు.శ్రీ వారి పింక్ డైమండ్ జగన్ అధీనంలో ఉన్నట్టుగా పవన్ కళ్యాణ్ కు ఎయిర్ పోర్ట్ లో ఒక పెద్ద స్థాయి అధికారి చెప్పినట్టుగా అతనే చెప్పుకున్నాడు. ఇప్పుడు పవన్ అభిమాన ఘణాన్ని చూసి సాక్షాత్తు ప్రధాని భద్రతా దళాలే భయపడుతున్నట్టు పవన్ కళ్యాణే చెప్పుకుంటున్నారు. దేశ భద్రతా దళాల కన్నా ముందుగా భారత నిఘా వర్గాలు ఏ ముఖ్యమైన సమాచారానైనా పవన్ కళ్యాణ్ కు చేరవేస్తారు అనే బావంతో పవన్ కళ్యాణ్ అనేక సందర్భాల్లో తనకు తాను చెప్పుకుంన్నారు . మరి పవన్ కళ్యాణ్ హైదరాబాద్ నివాసం వద్ద సుమారు 200 కోట్ల సుపారితో ఎవరో రెక్కి నిర్వహించారు అని ప్రచారం చేయించుకున్న పవన్ కళ్యాణ్ కు కేంద్ర నిఘా వర్గాలు ఆ సుపారి గ్యాంగ్ ఎవరో చెప్పలేదట ! అదే విధంగా రాజోలు గ్రామంలో జరిగిన పవన్ సభలో అనుమానంగా ఒక వ్యక్తి పవన్ ప్రక్కనే అనుమానస్పందంగా తిరుగుతున్నట్టు గట్టిగా ప్రచారం జరిపించుకుంటున్న పవన్ కు ముందుగానే నిఘా వర్గాలు ఎందుకు తెలియపరచలేదో పవన్ కళ్యాణ్ చెప్పాలి. పవన్ వింత ప్రవర్తన ఏమిటబ్బా అని మెజార్టీ ఆంధ్రులు తలలు పట్టుకుంరున్నారు. చంద్రబాబు దయతోనో, మరేకారణాలు చేతనో ప్రస్తుతం అధికారం దక్కించుకున్నారు.మరి శ్రీవారి పింక్ డైమండ్ ఎక్కడ ! 30 వేల పై భడిన అమ్మాయిల జాడ ఎక్కడ ! 200 కోట్లు సుపారీ గ్యాంగ్ ఎక్కడ ! మరి ఇప్పుడు ప్రధాని ఎస్.పి.జి దళాలు పవన్ అభిమానులకు భయపడటం ఏమిటో ఆంధ్రులకు అర్థం లేకుండా వుందని ఆయన తీవ్ర ఆక్షేపణ చేసారు. పవన్ మాటలకు చేతలకు అస్సలు పొంతన లేకపోతుంది.కొంతమంది యువతను ఈ లలు , కేకలు వేయిస్తు వారి బంగారు భవిష్యత్ ను నిర్వీర్యం చేయటంలో పవన్ కళ్యాణ్ ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు . ఒక నాయకునిగా ప్యాన్స్ కు మోటార్ బైక్స్ సైలెంసర్లు తీసేయండి అని ప్రోత్సహించే వారు నాయకుడా ! వారి భవిష్యత్ కోసం బాటలు వేసే వారు నాయకుడా ! పవన్ ఆత్మ సాక్షితో అంగీకరించాలి . పవన్ మాటల్లో పదే పదే నార తీస్తాను, ఇరగ తీస్తాను , కొడకల్లారా అనే పదాలు నాయకునికి ఉండాల్సిన అర్హత అంటారా ! ఆంధ్రుల దురదృష్ట వసాత్తు నా ఆంధ్ర రాష్ట్రంలో పవన్ కు కొంతమంది అభిమానులు ఏర్పడ్డారు . అదే మా రాష్ట్ర భవిష్యత్ కు శాపంగా మారింది . చంద్రబాబు కూటమిలో అధికారాన్ని అనుభవిస్తున్న పవన్ కళ్యాణ్ నాడు ఉచిత పథకాలు కోసం ప్రచారం చేసారు . నేడు ఉచిత పథకాలు ప్రజల భవిష్యత్ కు వినాశనం వంటివి అని పవన్ చెప్పటం విడ్డురంగా వుంది . చంద్రబాబు కూటమిలో వుంటూనే పవన్ ఇటువంటి ప్రకటనలు చేయటం వెనుక ఏమైనా రహస్యం ఆంతర్యం వుందా ! ఏది ఏమైన పవన్ కళ్యాణ్ వింత పోకడ రాజకీయాలతో ఆంధ్ర రాష్ట్రానికి తీవ్రమైన నష్టం జరుగుతుంది . ప్రత్యామ్నాయ మార్గంలో రాజకీయ మార్పుకు ఆంధ్రులు నడుం బిగించాలని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సభకు అర్పిసి సీనియర్ సెక్యులర్ సిమ్మాదుర్గారావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ ఎమ్‌డి హుస్సేన్, దుడ్డే సురేష్, కారుమూరి యుగంధర్, దోషి నిషాంత్, వాడపల్లి జ్యోతిష్, గుడ్ల సాయిదుర్గా ప్రసాద్, సుంకర వెంకట భాస్కర రంగారావు, చల్లా సాంబశివరావు, చల్లావంశీ తదితరులు పాల్గొన్నారు.

# 39వ డివిజన్ లింగంపేట వాంబే గృహాల వద్ద పర్యటన

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక 39వ డివిజన్ లింగంపేట వాంబే గృహాల వద్ద రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పర్య టించారు. స్థానికంగా నెలకొన్న సమస్యల కారణంగా సదరు వాంబే గృహాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారం అందుకున్న ఆయన డివిజన్ ఇన్‌ఛార్జ్ యాళ్ల ప్రదీప్, టీడీపీ నాయకులు, నగర పాలక సంస్థ అధికారులతో కలిసి పర్యటిం చారు. వాంబే గృహాల వద్ద గతంలో ఏర్పాటు చేసిన మంచినీటి మోటారు సక్రమంగా పని చేయకపోవడం వల్ల ప్రజలు నీటి



అవసరాలకు ఇబ్బందులుపడుతున్న కారణంగా నూతనంగా మోటారు ఏర్పాటు చేయాలని వెంటనే అంచనాలు తయారు చేసి నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. అలాగే సదరు వాంబే గృహాల్లోని పలు బ్లాకుల్లో సెప్టిక్ ట్యాంకుల సమస్యకు, డ్రేజీల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని ఆదేశించారు. అలాగే లింగంపేట 1వ వీధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయాల న్నారు. అలాగే పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డు తదితర సమస్యలు స్థానిక ప్రజలు ఆయన దృష్టికి తీసుకురాగా సాధ్యమైనంత త్వరగా అన్ని సమస్యకు కూటమి ప్రభుత్వ పరిష్కారం చూపిస్తుందన్నారు. టీడీపీ నాయ కులు, కార్యకర్తలు, స్థానిక పెద్దలు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెంట ఉన్నారు.

# 24 దఫాల్లో రూ.5.06 కోట్ల విలువైన చెక్కులు అందజేత

## కొత్తపేట నియోజకవర్గంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమానికి ప్రాధా న్యమిస్తూ, సీఎం రిలీఫ్ ఫండ్ కింద అర్హులైన ప్రతి ఒక్కరికీ సాయం అంద జేస్తున్నారని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు మొత్తం 24 దఫాల్లో రూ.5.06 కోట్ల విలువైన చెక్కులు అందజేశామని తెలిపారు.ఆదివారం రావులపాలెంలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే సత్యానందరావు, పేద ప్రజలకు తక్షణ సహాయంగా సీఎం రిలీఫ్ ఫండ్ వర్ధిల్లుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం పంపిన దరఖాస్తులన్నీ నిబంధనలకు అనుగుణంగా ఆమోదం పొందుతున్నాయని తెలిపారు. అదనంగా మరో 40 చెక్కులు మంజూరైనట్టు సీఎం కార్యాలయం నుంచి సమాచారం అందినట్లు తెలిపారు.మొత్తం 62 మందికి రూ.38,68,430 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో ఆత్రేయపురం మండలం నుంచి 12 మందికి రూ.8,73,709, రావులపాలెం మండలం నుంచి 19 మందికి రూ.10,86,616, కొత్తపేట మండలం నుంచి 17 మందికి రూ.8,65,290, ఆలమూరు మండలం నుంచి 14 మందికి రూ.10,42,815, మూడు ఎల్వోసీలతో పాటు 59 మంది రీయింబర్స్‌మెంట్ లకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకన్న దర్శనం వేగంగా, సేవలు సులభంగా ఒక్క క్లిక్‌తో ఆలయ సేవలు

**కొత్తపేట/ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు మరింత సౌకర్యం కల్పించేందుకు రాష్ట్రంలోని పలు ప్రముఖ దేవస్థానములలో సేవలు, దర్శనం బుకింగ్‌ను "ఆన్లైన్ సేవల బుకింగ్ వ్యవస్థ" ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చింది.భక్తులు తమ మొబైల్ ద్వారా ఇంటి నుంచే సులభంగా ఈ సేవలను బుక్ చేసుకుని, దేవస్థానంలో ఏర్పాటు చేయబడిన"ఫాస్ట్ ట్రాక్ కౌంటర్లు మరియు ప్రత్యేక క్యూ లైన్స్"ద్వారా త్వరితగతిన దర్శనం, సేవలు పొందవచ్చును. ఇందులో భాగముగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం,వాడపల్లి క్షేత్రము నందు శ్రీవారి దర్శనం, ఆర్జితసేవలు వాట్సప్ ద్వారా మరియు "వెబ్ సైట్" ద్వారా ముందగా బుక్ చేసుకోను సౌకర్యం కలదు. ఆన్లైన్ బుకింగ్ కోసం WhatsApp Number: 95523 00009, Website: https://www.aptemples.ap.gov.in Sri Venkateswara Swamy Devasthanam, Vadapalli. కావున భక్తులందరూ ఈ ఆన్లైన్ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి. ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకుని సులభమైన, వేగవంతమైన, పరిపూర్ణ సేవలను పొందగలరు. మీ సమయం విలువైనది. ఆన్లైన్‌లో ఆలయ సేవలను బుక్ చేసుకోండి శ్రీవారి సేవలో నల్లం సూర్యచక్రధరరావు ఉప కమీషనరు & కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

# అమలాపురంలో నూతనంగా ఆర్చరీ క్లాసులు ప్రారంభం



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలో ఆదివారం రాష్ట్ర సీనియర్ టి.డి.పి నాయకులు గంధం పల్లం రాజు చేతులు మీదుగా సాయి ఆర్చరీ అకాడమి ఘనంగా ప్రారంభం జరిగింది. దీనికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సెక్రటరీ పిఠాపురం లక్ష్మణ్ రావు, కోశాధికారి జి.శివప్రసాద్,రావడం జరిగింది. ముందుగా గంధం పల్లం రాజు రిబ్బన్ కత్తిరించి విల్లు విద్య శిక్షణ క్లాసులు ప్రారంభించడం జరిగింది. సాయి మార్షల్ ఆర్ట్స్ ఫౌండర్ దేశంశెట్టి సాయిబాబు ఈ ఆర్చరీ ని అమలాపురం నకు తీసుకొని రావడం జరిగింది. విల్లు విద్యను అందరూ విద్యార్థులు నేర్చుకోవడం ద్వారా ఎన్నో ఉన్నతస్థాయి లకు వెళ్లడంతో పాటు విల్లు విద్య ద్వారా విద్య, ఉద్యోగాలలో ఉన్న స్పోర్ట్ కోటాలో ఉన్న 3 శాతం కోటా ను అందరూ వినియోగించి కావాలి అని పి.లక్ష్మణ్ తెలియచేశారు. ఈ సందర్భంగా గంధం పల్లం రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలకు పెద్ద పీట వేసింది అని తెలియచేశారు. అంతే కాకుండా మన కోనసీమ నుండి కూడా మన సాయి ఆర్చరీ అకాడమి నుండి విల్లు విద్య విద్యార్థులు అంతర్ రాష్ట్ర స్థాయిలో మంచి పేరు తీసుకొని రావాలని తెలిపారు. రాజమండ్రి సీనియర్ మాస్టర్ శీలం వెంకటరావు సార్, కాకినాడ సత్తిబాబు సార్‌లు, ది అమలాపురం ఇంటర్ అండ్ డిగ్రీ కాలేజ్ డైరెక్ట్ అయిన గుర్రం నాయుడు సార్ ఎమ్. రాంబాబు సార్, ఎం.కిరణ్ సార్, నూకల నాగేశ్వరరావు సార్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### హౌసింగ్ బోర్డు కాలనీలో

# ఘనంగా ముగిసిన సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు



ఐదు వేల మంది భక్తులకు భారీ అన్న సమారాధన



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలో మాజీ కార్పొరేటర్ నందూరిరమణ వ్యవస్థాపకులుగా ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో షష్టి వేడుకలు ఘనంగా ముగిసాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ధర్మకర్త నందూరి సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం 5వేల మంది భక్తులకు భారీ ఎత్తున ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి భక్తులకు ఆహార పదార్థాలను వడ్డించారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నందూరి మాట్లాడుతూ సుబ్రహ్మణ్య స్వామి షష్టి వేడుకలను విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన హౌసింగ్ బోర్డ్ కాలనీ ప్రజలకు, భక్తులకు, దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. భక్తులందరూ ఆ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుని ఆయన ఆశీస్సులతో ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఇక్కడ వెలిసిన స్వామివారిని దర్శించుకుంటే వారి కోరికలు ఖచ్చితంగా నెరవేరుతాయని పేర్కొన్నారు. ఆ స్వామివారి దయతో ఈనెల 23 నుంచి సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవ వేడుకలను అంగరంగ భాగంగా నిర్వహించడం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘా కోళ్ళపు శివరామ సుబ్రహ్మణ్యం, ప్రముఖ ఆడిటర్ విశ్వనాథం భాస్కర రామ్, ప్రముఖ వైద్యులు డాక్టర్ తులసి మోహన్ రావు, వ్యాపారవేత్త చలుమూరు శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు వాకచర్ల కృష్ణ, కంచుమర్తి చంటి, లాలా చెరువు మాజీ సర్పంచ్ మెట్ల ఏసు పాదం, గార్లపాటి సూర్య నారాయణ, బులుసు ప్రకాష్, ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు, నగర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

### కళాత్మకమైన నృత్య ప్రదర్శనతో

# చూపారుల హృదయాలను కట్టి పడేసిన "అభి"





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** చిన్నతనం నుండే తన తల్లి దండ్రుల అభిరుచి మేరకు, గురువర్యులు శ్రీ శివసాయి కూచిపూడి కళా క్షేత్రం నిర్వహికురాలు కళా తపశ్వి తణుకు సాయి మాదవి శిక్షణలో జాతీయ స్థాయిలో జరిగిన కూచిపూడి పోటీల్లో అభి తన ప్రతిభను నిరూపించుకుంది.అభి గృహంలో ఎటు చూసినా తను సాధించిన మెమోంటోలు ,సరిఫికెట్లు , మెడల్స్ స్వాగతం పలుకుతుంటాయి.ఇంటికి వచ్చిన అతిదులు సాక్షాత్తు ఆ నటరాజ స్వామి నీ నృత్యంలో కనపడుతుంటా దమ్మా అంటు పలువురు పెద్దలు దీవిస్తు కితాబులతో అభిని ఆనంద పరచటం చిరంజీవి అభిలో ఒకరకమైన కొత్త ఉత్సాహం ఇస్తుంది.అభి మాటల్లో నా ప్రతిభ,నాలో నాట్యం సాయి మాదవి శ్రమ కృషికి తర్కాణం అని చెప్పటం విశేషం.. నేడు సీతానగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో అద్భుతమైన నాట్య ప్రదర్శన చేసి చిరంజీవి అభి తన ప్రతిభను నిరూపించుకుంది. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి కేంద్రంగా శివ సాయి కూచిపూడి కళా క్షేత్రం నిర్వహించడం సాహితీ నగరంగా చారిత్రిక పేరు గాంచిన రాజమండ్రి మరో చరిత్రకు పునాది అవుతుందని పలువురు ప్రశంసలు కురిపించారు. చిరంజీవి అభిని కూచిపూడి నాట్యంలో పూర్తి స్థాయిలో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు సిహెచ్ వెంకట్, భవానీలను పలువురు గురువులు, పెద్దలు మెచ్చుకున్నారు.. అభి కలియుగ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వేషధారణిలో సాక్షాత్తు శ్రీ వారి సన్నిధిని మెప్పించినట్టుగా వుంది. అభితోపాటుగా విభిన్న పాత్రాలు పోషించి వారి నృత్య ప్రదర్శనతో అందరిని మెప్పించిన తోటి కూచిపూడి నృత్య కారిణిలు వారి ప్రతిభను ఎంతో గొప్పగా చాటుకున్నారు. చిరంజీవి అభి హిందూ ధర్మానికి ప్రతీకగా కూచిపూడి నాట్యం పట్ల ఆకర్షింపబడటం రామాయణ, మహాభారత పవిత్ర గ్రంధాలను మెప్పించినట్లేనని, చిన్నతనం నుండి పిల్లల్లో హిందూ ధర్మ విలువలను, కూచిపూడి నాట్యం గొప్పతనాన్ని పిల్లలకు తెలియచేసే విధంగా పాఠశాలల్లో ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. శ్రీ శివ సాయి కూచిపూడి కళా క్షత్రాన్ని ప్రభుత్వాలు గుర్తించాలి. ఇప్పటికే శ్రీమతి సాయి మాదవి సారథ్యంలో జాతీయ స్థాయిలోను, ప్రధానంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక పోటీల్లో గోల్డ్ మెడల్స్, ప్రతిష్టాత్మకమైన మెమోంటోలు, సర్టిఫికెట్స్ సాధించిన ఖ్యాతి సాయి మాదవి సొంతం. చిరంజీవి అభి తో పాటుగా ఎంతో మాది కూచిపూడి విద్యార్థులు శ్రీ శివ సాయి కూచిపూడి కళా క్షేత్రంలో వున్నారు అని చెప్పుకోవటానికి ఎంతో గర్వాంగా వుంటుందని కొందరు ప్రముఖులు సాయి మాదవి ని ప్రశంసలతో మురిపించారు.

# నీటి వాడకంపైన ప్రజలకు అవగాహన ర్యాలీ




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదివారం ఉదయం రాజమహేంద్రి మహిళా డిగ్రీ మరియు పీ.జీ. కళాశాల ఆధ్వర్యంలో రత్నంపేటలో జరుగుతున్న జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం నాల్గవ రోజులో భాగంగా ఎన్.ఎస్.ఎస్. వాలంటర్లు నీటిని పొదుపుగా వాడకం పైన ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కె.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో చాలా రాష్ట్రాల్లో నీరు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని మన జిల్లాలకు మాత్రం గోదావరి నది ఉండడం వలన నీటికి కొరత ఉండడం లేదని కానీ మనం జాగ్రత్తలు పాటించకుండా నీటిని వృధా చేస్తే మనకి కూడా నీటి కొరత ఏర్పడే ప్రభావం ఉందని దానిని తెలుసుకొని నీటి వాడకం పొదుపుగా చేయాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు రత్నంపేట ఏరియాలో ర్యాలీ చేసి ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రజలకు పొదుపుగా నీటిని ఏ విధంగా వాడాలో, నీటీ వాడకం పైన తీసుకోవాల్సిన జాగ్రత్తలను, నీరు లేకపోతే మానవాలికి కలిగే ఇబ్బందులను గురించి వివరంగా ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్.ఎస్.ఎస్. పి.ఓ దంటు వీర వెంకట్రావు, మాజీ పీ.వో. లక్ష్మీ ప్రవీణ, ఎన్.ఎస్.ఎస్. క్లర్క్ మౌనిక, శాంతి, సురేష్, కళాశాల ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

# ఫిబ్రవరిలో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పట్టణం, శ్రీ చైతన్య విద్యా సంస్థలు ఆధ్వర్యంలో, మూడవ ప్రపంచ తెలుగు మహా సభలు ఫిబ్రవరి లో జరగనున్న నేపథ్యంలో ముందస్తు సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, బ్రోచర్



ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు. ఈ కార్యక్రమంలో చైతన్య గ్రూప్ విద్యా సంస్థల అధినేత కె.వి.వి. సత్యనారాయణ రాజు(చైతన్య రాజు), రాష్ట్ర టీడీపీ విప్పు, ముమ్మడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్య నారాయణ, బొమ్మి ఇజ్రాయల్, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, పెచ్చేట్టి విజయలక్ష్మి, ఇసుకపట్ల రఘు బాబు, బోనం సత్తిబాబు, ఎస్ టి యు దొరబాబు, పినిపే సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com

విశ్వవాయిస్
VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్

సోమవారం, 01 డిసెంబర్ 2025
www.viswamvoice.com






### పచ్చని పంట పొలాలు, పూల తోటల మధ్య వేంచేసి ఉన్న

# విజయ దుర్గమ్మ వారి తీర్థ మహోత్సవం

### వైభవంగా బొడుగువానిలంక దుర్గమ్మ తీర్థ మహోత్సవం





**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పచ్చని పంట పొలాలు, పూల తోటల మధ్య వేంచేసి ఉన్న విజయ దుర్గమ్మ వారి తీర్థ మహోత్సవం ఆదివారం ఎంతో వైభవంగా జరిగింది.లంక రైతుల ఆరాధ్య దైవంగా ఈ అమ్మవారిని కొలుస్తారు. ఈ లంక భూముల్లో సాగయ్యే పూల,కూరగాయ, వాణిజ్య పంటలకు ఈ అమ్మవారు అండగా ఉంటారని రైతుల నమ్మకం.అందుకునే ఈ లంకల్లో భూములున్న ఆలమూరు మండలంతో పాటు కడియం, ఆత్రేయపురం, రావులపాలెం మండలాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున కుటుంబ సభ్యులతో ఇక్కడికి తరలివచ్చి అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు.పలువురు అమ్మవారి పటిక బెల్లంతో తులాభారం ఇచ్చి మొక్కలు చెల్లించుకున్నారు. అలాగే లంక గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఈ అమ్మవారి తీర్థ మహోత్సవంకు విచ్చేసారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతమంతా ఆలయ కమిటీ వారు విద్యుత్ అలంకరణతో తీర్చిదిద్దారు. అలాగే పలు సాంస్కృతి కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.ఈ ఉత్సవాలలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ఆలమూరు ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసారు.

# ప్రతిభ గల చిన్నారులకు భారత్ టాలెంట్స్ అవార్డ్స్ ప్రధానం



**కొత్తపేట/ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** చిన్నారులను ఉత్తమ స్థానానికి తీసుకెళ్లడానికి కళ దోహదం చేస్తుంది సౌభాగ్య గ్రూప్ అధినేత చిన్నం చంద్రారెడ్డి ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు ర్యాలి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ మరియు శ్యామ్ జాదూగర్ మాయా ఈ బడి ఆధ్వర్యంలో నిర్వహించిన పదవ జాతీయస్థాయి భారత్ టాలెంట్ చిల్డ్రన్స్ ఫెస్ట్ లో దేశవ్యాప్తంగా ఎంపిక కాబడిన 18 మంది చిన్నారులు వివిధ కళారూపాలలో విశేష ప్రతిభ చూపించి భారత్ టాలెంట్ బాల విభూషణ్, బాల భూషణ్, బాలశ్రీ అవార్డులను కైవసం చేసుకున్నారు. ఈ అవార్డులను ప్రముఖ గైనకాలజిస్ట్ ఎం. దివ్య రెడ్డి మరియు సౌభాగ్య గ్రూప్ అధినేత చిన్నం చంద్రా రెడ్డి దంపతుల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ చిన్నారులను ఉత్తమమైన స్థానానికి తీసుకువెళ్లడానికి కలలు దోహదం చేస్తాయని చిన్నారులకు ఇష్టమైన కలలో శిక్షణ ఇప్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో శ్యామ్ జాదుగర్ మెగా మ్యాజిక్ ఫ్యామిలీ సభ్యులు శ్యామ్ అన్నపూర్ణ, డాక్టర్ మోహిత్ సీత, తేజశ్రీ లు పాల్గొన్నారు.

# డిసెంబర్ 2న కోనసీమ జిల్లాకు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ రాక



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పర్యటన సందర్భంగా డిసెంబర్ 2వ తేదీన అమలాపురం యం ఆర్ పి యస్ సీనియర్ నాయకులు గంపల సత్యప్రసాద్ మాదిగ గంపల దుర్గాప్రసాద్ మాదిగ కుమారులు.విజయ్.వినయ్ ల వివాహ రెసెప్షన్ కు విచేయుచున్నారు కాబట్టి ఉదయం 9 గంటలకు జిల్లాలో ఉన్న 7 నియోజకవర్గాల నుండి ఇంచార్జి లు బాధ్యతలను తీసుకుని ప్రతి మండలం నుండి 2 వాహనాలు తప్పనిసరిగా కార్యక్రమానికి వెళ్ళుటకు రావులపాలెం కోనసీమ ముఖ ద్వారం వద్దకు రావాలని కోరడమైనది.ఎం.ఆర్.పి. ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మర రాఘవ మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు.2 వ తేదీన పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పర్యటనకు జిల్లాలో ఉన్న ప్రతి ఒక్క యంఆర్పియస్, యంయస్పి నాయకుడు ప్రతి ఒక్కరు కార్యక్రమంను విజయవంతం చెయ్యాలని కోరుతూ తప్పనిసరిగా డ్రెస్ కోడ్ పాటించాలని అన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో అన్ని గ్రామాల ఎం.ఆర్.పి. ఎస్ నాయకులు, కార్యకర్తలు అందరూ కదిలి రావాలని కోరారు.వివాహ కార్యక్రమం అయిన వెంటనే 3 జిల్లాల ముఖ్య నాయకులతో సమావేశం ఉంటుంది కాబట్టి అందరూ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరువ్వాలని కోరారు.

### కోట లక్ష్మణరావు కుటుంబానికి ఐదు లక్షల ఇన్సూరెన్స్ చెక్కును

# అందజేసిన యువ నాయుకులు బండారు సంజీవ్



**కొత్తపేట/ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కార్యకర్తలే తెలుగు దేశం పార్టీ బలం కార్యకర్త కోట లక్ష్మణరావు కుటుంబానికి ఐదు లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందజేసిన యువ నాయుకులు బండారు సంజీవ్ కొత్తపేట తెలుగు దేశం పార్టీ యువ నాయకులు బండారు సంజీవ్ ఆత్రేయపురం మండలం, పేరవరము గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త కోట లక్ష్మణరావు ప్రమాదవశాత్తు మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. కార్యకర్త కుటుంబానికి అండగా నిలుస్తూ, ఆయన భార్య విజయ లక్ష్మీ కి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును మంగళవారం పేరవరము గ్రామంలోని వారి స్వగృహంలో అందజేశారు. ఈ సందర్భంగా బండారు సంజీవ్ మాట్లాడుతూ "కార్యకర్తలే పార్టీకి నిజమైన బలం.వారి కష్టం,నిబద్ధతను తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ మరవదు. పార్టీ తరపున ప్రతి కార్యకర్తకు అండగా, తోడుగా నిలబడటం మా కర్తవ్యంగా భావిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ తరపున అన్ని విధాలా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాజపేయి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పార్లమెంట్ పరిధిలోని మండపేట బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి పాల్గొన్నారు. కేంద్ర భారీ పరిశ్రమల, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, స్టానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, బీజేపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎస్ మాధవ్, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు లతో కలిసి వాజపేయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎంపీ హరీష్ మాట్లాడుతూ వాజపేయి హయాంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగిందన్నారు. వేగవంతమైన రవాణా జరుగుతుందంటే హైవేల అభివృద్ధి చేసిన వాజపేయి వల్లేనన్నారు. తన తండ్రి జీఎంసీ బాలయోగి డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాను అభివృద్ధి చేయడంలో వాజపేయి సహకారం మరువలేనిదని ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు.

# అటల్ బిహారీ వాజ్‌పాయి విగ్రహావిష్కరణ

### ముఖ్య అతిథులుగా పాల్గొన్న పలువురు నేతలు...





**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట బైపాస్ రోడ్డు వంతెన కూడలి వద్ద మాజీ ప్రధానమంత్రి, భారతరత్న దివంగత అటల్ బీహార్ వాజ్ పాయ్ విగ్రహం ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పోకల వెంకట నాగేంద్ర మాధవ్, రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరిలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు,అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నీటిపారుదల సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ లు పాల్గొన్నారు. ఆవిష్కరణ అనంతరం కేంద్ర ఉక్కు శాఖా మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, అమలాపురం ఎంపీ జిఎంసి హరీష్ మధుర్‌లు అక్కడికి విచ్చేసి వాజ్ పాయి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మండపేట మునిసిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి, రైస్ మిల్లర్స్ అసిసియేషన్ మాజీ అధ్యక్షులు వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరి, మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ,భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, సీనియర్ నాయకులు కోన సత్యనారాయణ, కోటిపల్లి సాయిరాం, కంకటాల మురళీకృష్ణ, ఛత్రపతి జానకి రాంబాబు, మండపేట పట్టణ బిజెపి అధ్యక్షుడు నాళం ఫణి ప్రకాష్ , మద్దుల సుబ్బారావు, పాలిక రమణ,పందిరి వీర్రాజు, వెత్స దుర్గాప్రసాద్, బిజెపి నాయకులు, కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చుండ్రు శ్రీ వరప్రకాష్ సేవలు చిరస్మరణీయం

### ఆయన కుటుంబానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుంది - సంతాప సభలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



**మండపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** తెలుగు దేశం పార్టీకి విశేష సేవలు అందించిన నాయకుడు, మండపేట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీ వరప్రకాష్ సేవలు చిర స్మరణీయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఇటీవల అకాల మరణం చెందిన వరప్రకాష్ సంతాప సభ మండపేటలోని రైస్ మిల్ అసోసియేషన్ భవన్లో ఆదివారం స్థానిక శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ టిడిపికు, మండపేట వాసులకు చుండ్రు వరప్రకాష్ చేసిన సేవలు ప్రతి ఒక్కరి మదిలో గుర్తుండిపోతాయన్నారు. ఒక మనిషి ఎంతకాలం బ్రతకామన్నది కాదు.. ఎలా బ్రతకామన్నది, ఎంతమంది మనసులో చోటు సంపాదించుకున్నాం.. సమాజానికి ఏం చేశాం అన్నది ముఖ్యమన్నారు. నమ్ముకున్న వారికి కొండంత అండగా నిలబడే మంచి నాయకుడిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. మండపేట మాజీ మున్సిపల్ చైర్మన్‌గా, తణుకు నియోజకవర్గ పరిశీలకులుగా ఎంతో సమర్థవంతంగా పనిచేశారని సభలో గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి మన మధ్య ఇక లేరంటే నమ్మకం కలగటం లేదన్నారు. చుండ్రు వర ప్రకాష్ కుటుంబానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అందరివాడుగా, స్నేహపూర్వకమైన కలుపుగోలు తనంతో తలలో నాలుకలా మెలిగిన మంచి మనిషి వరప్రకాష్ అన్నారు. శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బండారు సత్యానందరావులు మాట్లాడుతూ వర ప్రకాష్ రాజకీయ జీవితకాలంలో మచ్చలేని మహారాజులాగా పరిపాలన దక్షత, విలువలతో కూడిన రాజకీయాలతో తనదైన శైలితో ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించారని స్మరించుకున్నారు. ఐదేళ్ల ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నా ఎలాంటి విమర్శలు లేకుండా పని చేశారన్నారు. ప్రతిపక్షాలు సైతం వర ప్రకాష్ మున్సిపల్ చైర్ పర్సన్ గా ఉన్న 2014 నుంచి 2019 వరకు ఆయనపై ఒక్క విమర్శకు కూడా తావులేకుండా నిబద్ధతతో నడుచుకున్నారన్నారు. ఆయన ఐదేళ్ల పరిపాలనలో స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు సహకారంతో పట్టణాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించారన్నారు. రాజకీయాల్లో అజాత శత్రువుగా గుర్తింపు దక్కించుకున్నారన్నారు. ఆయన కుటుంబానికి తెలుగుదేశం పార్టీ తోడుగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# మండపేటను తూర్పుగోదావరిలో విలీనం కేవలం అపోహ మాత్రమే...

### రెవెన్యూ డివిజన్ పరిధి మాత్రమే విలీనం... - మున్సిపాలిటీని మీ జాగీరుగా మార్చేశారా...??
### కమిషనర్ తీరుపై ఎమ్మెల్సీ తోట ఆగ్రహం... - ప్రజలు అన్నీ గమనిస్తున్నారు...



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణం విజయలక్ష్మి నగర్ వైయస్సార్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మండపేట నియోజకవర్గం తూర్పుగోదావరి జిల్లాలో విలీనమైపోయిందని జరుగుతున్న ప్రచారం పూర్తిగా అపోహ మాత్రమేనని, మారింది కేవలం రెవెన్యూ డివిజన్ పరిధి మాత్రమేనని,విలీనమనే అంశాన్ని శాస్త్రీయ కోణంలో అర్థం చేసుకోవాలని అన్నారు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్లమెంటు నియోజకవర్గ పరిధిని ఒక జిల్లాగా పరిగణించి జిల్లాల రూపకల్పన చేశారని, అయితే మండపేట నియోజకవర్గం అంతకుముందే అమలాపురం పార్లమెంటు పరిధిలో ఉందన్న వాస్తవాన్ని గుర్తు చేశారు. ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలో మూడు కొత్త జిల్లాలు, కొన్ని రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుందని, అయినా మండపేట నియోజకవర్గం అమలాపురం పార్లమెంటు నుంచి రాజమహేంద్రవరం పార్లమెంటు పరిధిలోకి మారలేదని స్పష్టం చేశారు.ఇప్పటివరకు జిల్లా పరిధిగా అమలాపురం, రెవెన్యూ డివిజన్‌గా రామచంద్రపురం ఉండగా, ఇకపై రెవెన్యూ కార్యకలాపాలు రాజమహేంద్రవరం ఆర్డీఓ కార్యాలయం నుంచి జరుగుతాయని, ఈ మార్పు తప్ప మండపేట నియోజకవర్గంపై మరేమీ ప్రభావం ఉండదని ఎమ్మెల్సీ ధీమా వ్యక్తం చేశారు.మండపేట తూర్పుగోదావరి జిల్లాలో విలీనమైందని భావించడం తప్పుడు ప్రచారమేనని అన్నారు. అనంతరం శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి హాజరు కాకుండా తనను రాజకీయంగా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తే సహించేది లేదని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హెచ్చరించారు.శనివారం జరిగిన మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి తనకు అజెండాతో కూడిన ఆహ్వాన పత్రిక పంపకపోవడం వెనుక స్పష్టమైన రాజకీయ కుట్ర ఉందని తోట త్రిమూర్తులు ఆరోపించారు. మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి స్వయంగా తనకు ఆహ్వానం పంపాలని చెప్పిన కమీషనర్ టివి రంగారావు సిబ్బందికి పంపొద్దు అని ఆదేశించడం ద్వారా రాజకీయ ఒత్తిడి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.తాను ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచీ ప్రతి కౌన్సిల్ సమావేశానికీ హాజరవుతూ వస్తున్నానని పేర్కొన్నారు.ఈసారి మాత్రమే రాజకీయంగా అడ్డుకునే ప్రయత్నం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా సరే, ఎక్స్-అఫీషియో సభ్యుడిగా తనకు ఉన్న హక్కును కాపాడుకుంటూ సమావేశంలో నిలబడి ప్రశ్నించానని చెప్పారు.2023లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను చూపిస్తూ ఓటు హక్కు లేకపోయిన సమావేశాలకు హాజరయ్యే హక్కు ఖచ్చితంగా ఉంటుందన్నారు. ఆ హక్కును కాలరాసేందుకు కమిషనర్ ద్వారా కొందరు విశ్వప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.కమిషనర్ ను ప్రశ్నస్తూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని అమలు చేయకుండా మీ సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారా అంటూ మండిపడ్డారు. మీరు మీ పై అధికారుల ఆదేశాలను ఆచరణలో పెట్టకుండా అధికార పార్టీ నాయకుల ఆదేశాలను ఆచరణలో పెట్టడం ద్వారా మీ సర్వీస్ ముగిసిన తదుపరి కూడా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.అధికార పార్టీ నాయకులు చెప్పినట్టు మున్సిపాలిటీని తమ జాగీరుగా మార్చేశారా అని ప్రశ్నించారు తనపై రాజకీయం చేసే వాళ్లకు సిగ్గుండాలని, అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు మేలు చేయాలని హితవు పలికారు.అయ్యిందేదో అయిపోతుంది. కూర్చోండంటూ సర్ది చెప్పే రోజులు రాకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, సీనియర్ నాయకులు పిల్లా వీరబాబు, శెట్టి నాగేశ్వరరావు, జొన్నపల్లి సత్తిబాబు, కౌన్సిలర్లు మందపల్లి రవికుమార్, యర్రగుంట అయ్యప్ప, తీగిరెడ్డి మహేష్, శనక్కాయల దొరబాబు పాల్గొన్నారు.

# అమలాపురం ఆక్వా ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు



### క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి : చెరుకూరి సాయిరాం

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని అమలాపురం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి చెరుకూరు సాయిరాం అన్నారు. ఆదివారం అమలాపురం ఆక్వా ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ లీగ్ సీజన్ 8 నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చెరుకూరి సాయిరాం మాట్లాడారు. తొలుత గ్రూప్ సీ అండ్ గ్రూప్ డి తో జరిగిన ఫైనల్ మ్యాచ్లో గ్రూప్ సి జట్టు విజయం సాధించింది.అమలాపురం ఆక్వా ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ లీగ్ పోటీలు అమలాపురం బాలయోగి స్టేడియంలో గత రెండు రోజుల నుంచి జరుగుతున్నాయి దీనిలో కోనసీమలోని పలు మండలాల నుండి 20 టీములు పాల్గొనగా ఆదివారం జరిగిన ఫైనల్ లో సి, డి జట్టులకు జరిగిన తుది పోరులో సి జట్టు విజయాన్ని అందుకుంది.వీరి కి చెరుకూరి సాయిరాం చేతుల మీదుగా కప్పు ను అందజేశారు.అనంతరం పలువురు ఆక్వా సంఘ నాయకులు మాట్లాడుతూ. నిత్యం చెరువులు వద్ద,ఫీడ్ షాపుల వద్ద బిజీ బిజీగా ఉండే ఆక్వా ఉద్యోగులకు,సిబ్బందికి ఇది కొంతవరకుఉపశమనాన్నిస్తుందని పలువురు పేర్కొన్నారు. ఈ క్రీడలతో మానసికంగా, ఉత్తేజంగా ఉండేందుకు ఉపయోగపడ్డాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోనసీమ ఆక్వా అసోసియేషన్ నాయకులు దుర్గరాజు,అవినాష్,గుబ్బల రాజా, అమలాపురం ఆక్వా అసోసియేషన్ అధ్యక్షులు రత్నం రాజు, శ్రీహరి, వెంకటేశ్వరరావు, రవి కిరణ్, గోపాలం, నవీన్ పాల్గొన్నారు. ఈ క్రికెట్‌ను తిలకించేందుకు అధిక సంఖ్యలో యువకులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

కాకినాడ
జిల్లా ఎడిషన్

సోమవారం, 01 డిసెంబర్ 2025
www.viswamvoice.com





### మంజూరైన వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని..

# అడ్డుకుంటున్న కార్పొరేట్ సంస్థ..

## రెండు దశాబ్దాలుగా త్రాగునీరు సదుపాయం లేక విలపిస్తున్న కాలనీవాసులు

**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట గ్రామపంచాయతీ పరిధిలో గల జన చైతన్య లేఅవుట్ ఆనుకుని సాయి శంకర్ నగర్ పేరుతో ఎల్ పి నెంబర్ 17/06/ఆర్ ప్రకారం సుమారు ఐదు ఎకరాల్లో లేఅవుట్ వేయడం జరిగింది. ఈ లేఔట్ లో 100 కుటుంబాలకు పైగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇల్లు నిర్మించుకుని 20 సంవత్సరాల నుండి జీవనం సాగిస్తున్నారు. ఇంతవరకు అధికారులు కానీ, పాలకులు గాని ఈ కాలనీకి కనీస మౌలిక వసతుల కల్పనకు కృషి చేయలేదు. ఈ ప్రాంతంలో లభ్యమయ్యేది ఉప్పునీరు కావడం వల్ల కనీసం త్రాగునీరు లేక ఈ వంద కుటుంబాలు చాలా దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. మురుగునీరు కాలువల ఏర్పాటు కూడా చేయలేదు. పార్కులు లేవు. త్రాగునీరు కోసం అధికారులు నాయకులు చుట్టూ సంవత్సరాల తరబడి ప్రదక్షిణాలు చేయగా చేయగా గత ప్రభుత్వ హయాంలో ట్యాంక్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ఎస్టిమేషన్ వేయించడం జరిగింది. ఈ వాటర్ ట్యాంక్ ను ఈ లేఔట్ పరిధిలో సామాజిక స్థలంగా కేటాయించిన 43 సెంట్లు భూమిలో నిర్మాణం చేపడదామని తొలుత అధికారులు నాయకులు భావించారు. అయితే అసలు చిక్కు ఇక్కడే వచ్చింది. ఈ 43 సెంట్లు సామాజిక స్థలాన్ని ఓ ప్రైవేటు విద్యాసంస్థ తమ వాహనాలను నిలుపుకునేందుకు అనధికారకంగా వినియోగించుకోవడం జరుగుతుంది. దీనిపై గ్రామస్తులు ఎన్నోసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా వారు మాత్రం ఆ ప్రైవేటు విద్యాసంస్థ జోలికి అస్సలు వెళ్లరు. లక్షలాది రూపాయల ముడుపులు ఇచ్చి ఆ ప్రైవేటు విద్యాసంస్థ యాజమాన్యం వారు అధికారులను తమ చెప్పు చేతల్లో పెట్టుకున్నారని



కాలనీవాసులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఇది గత 15 సంవత్సరాల నుంచి ఇలాగే జరుగుతున్న ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో తమ ఘోష కొత్త ప్రభుత్వం పట్టించుకుంటుందనే ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీని కాలనీ సభ్యులు అంతా కలిసి తమ సమస్యలను విన్నవించుకోవడం జరిగింది. గతంలో వాటర్ ట్యాంకు మంజూరైన విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. దీనికి అనుగుణంగా సంబంధిత అధికారులకు దీనిపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే నానాజీ ఆదేశించడం జరిగింది. దేవుడు వరమిచ్చిన పూజారి వరము ఇవ్వలేదనే సామెత చెప్పినట్లుగా ఎమ్మెల్యే చెప్పినా సరే ఆర్డబ్ల్యూఎస్ అధికారులు మాత్రం ఆ ప్రైవేటు విద్యాసంస్థకు గులాం గిరి చేస్తూ వారు చెప్పినట్లుగా ఆడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సామాజిక స్థలంలో వాటర్ ట్యాంక్ తో పాటు పార్కు నిర్మాణం జరిగితే ఆ ప్రైవేట్ విద్యాసంస్థ వాహనాలు నిలుపుకోవడానికి ఇబ్బందికరంగా మారుతుం దనే ఉద్దేశంతో సదరు అధికారులు త్రాగునీరు కోసం జరిపిన మట్టి పరీక్షల్లో నాణ్యత లేదని పంచాయతీ వారికి నివేదికలు అందజేయడం జరిగిందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని కాలనీవాసులు సంప్రదించగా ఆ సామాజిక స్థలంలో మంచినీటి లభ్యతకు కావలసిన నాణ్యత ఆ ప్రాంతంలో లేదని, వాటర్ ట్యాంక్ నిర్మాణం వేరే స్థలంలో కేటాయించాలని ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు తెలపడం వల్ల తాము ఏమీ చేయలేని స్థితిలో ఉన్నామని పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారని కాలనీవాసులు తెలియజేశారు. దీనిపై తాము ఆర్డబ్ల్యూఎస్ అధికారులను సంప్రదించి వారు జరిపిన మట్టి పరీక్షల నివేదికను లిఖితపూర్వకంగా అందించాలని కోరగా వారి నుండి కనీస స్పందన లేదు అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఎంత విచిత్రమైన పరిస్థితి అంటే ఈ సామాజిక స్థలానికి కూత వేటు దూరంలో అంటే 500 మీటర్ల లోపు పరిధిలో జనచైతన్య లేఔట్ పరిధిలో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి మంచినీరు అందిస్తున్నప్పటికీ ఇక్కడ మట్టి పరీక్షల్లో నాణ్యత లేదని తేలిందని అధికారులు చెప్పడం లంచాలు మింగి ఆ ప్రైవేటు విద్యాసంస్థకు కొమ్ము కాయడమే నని వారు ఆరోపిస్తున్నారు. అసలు ఏ ప్రాతిపదిక మీద సామాజిక స్థలాన్ని కార్పొరేట్ విద్యాసంస్థ వాహనాలు పార్కింగ్కు అధికారులు అనుమతించారని కాలనివాసులు ప్రశ్నిస్తున్నారు. లక్షలాది రూపాయలు ముడుపులు అందించడమే కాకుండా పైనుంచి సిఫార్సులు చేయించడం వల్లే అధికారులు ఇంతకాలం స్పందించకుండా మిన్న కుండిపోయారని వారు విమర్శిస్తున్నారు. సుమారు 20 సంవత్సరాల కాలం నుండి కాకినాడ రూరల్ మండలంలో ఉన్న రమణయ్యపేట పంచాయితీకి స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగక పోవడం వల్ల పాలకవర్గం లేక ప్రత్యేక అధికారుల పరిపాలనలో అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయింది. ఓ పక్క ప్రభుత్వాల నుంచి వచ్చే ఆదాయం లేక మరోపక్క ప్రత్యేక అధికారుల పాలనలో నిధులు దుర్వినియోగమై పంచాయతీ పరిధిలో కనీస మౌలిక వసతులు ఏర్పాటు జరగడంలేదని కాలనీవాసులు విమర్శిస్తున్నారు. తాగునీరు కనీస మౌలిక సదుపాయాల కల్పన కోసం సదరు కాలనీవాసులంతా కలిసి గ్రీవెన్స్ లో కలెక్టర్ ను సంప్రదించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తక్షణమే సంబంధిత అధికారులు పిలిపించి దీనిపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అయినప్పటికీ ఇంతవరకు సంబంధిత అధికారులు ఈ విషయంపై ఎలాంటి పరిష్కారం అందజేయలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లేందుకు కార్యచరణ రూపొందిస్తున్నామని తెలిపారు.

# రెండు దశాబ్దాల పోరాటానికి విజయం : కరప భూ వివాదంలో తుది తీర్పు అమలు

**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** సరిగ్గా ఇరవై ఒక్క సంవత్సరాలుగా సాగిన ఒక సుదీర్ఘ న్యాయపోరాటానికి చారిత్రక ముగింపు లభించింది. కాకినాడలోని రెండవ అదనపు పౌర న్యాయస్థానం ఇచ్చిన తీర్పు అమలు సూచన మేరకు, న్యాయస్థానం ఉద్యోగులు, కరప పోలీసుల సమక్షంలో వివాదాస్పదమైన స్థలాన్ని అసలైన హక్కుదారులకు అధికారికంగా అప్పగించారు. రెండు దశాబ్దాలకు పైగా కొనసాగిన ఈ భూమి తగాదా 2004లో సాధారణ వ్యాజ్యంగా మొదలైంది. ఆ తర్వాత మొదటి అప్పీలు, అనంతరం ఉన్నత న్యాయస్థానంలో రెండు ప్రత్యేక అప్పీళ్లను దాటుకుంటూ చివరికి తీర్పు అమలు దశకు చేరుకుంది. ఈ వ్యవహారం అనేక న్యాయస్థానాల మధ్య ప్రయాణించి, పలు విచారణలు, తీర్పులు, అప్పీళ్లను ఎదుర్కొన్నప్పటికీ, అంతిమంగా ధర్మమే నిలిచింది. న్యాయస్థానం జారీ చేసిన ముఖ్య ఆదేశాల మేరకు, ఆ స్థలాన్ని కొలవడానికి ఇద్దరు న్యాయస్థానం ఉద్యోగులను నియమించడం, పోలీసుల



సహాయం తీసుకోవడం, ఎవరైనా అడ్డుకుంటే అరెస్టు చేసే అధికారం, అవసరమైతే తాళాలు పగలగొట్టడం, స్థలంలో ఉన్న గుడిసెలు లేదా ఇతర అడ్డంకులను తొలగించడం వంటి చర్యలు తీసుకున్నారు. ఈ ఆదేశాలను శిరసావహిస్తూ కరప పోలీసులు ఆదివారం ఉదయం రంగంలోకి దిగి, అడ్డంకులన్నీ తొలగించి, భూమిని నేరుగా హక్కుదారులకు అప్పగించారు. '004 నుంచి ఈ రోజు వరకు, మొత్తం ఇరవై ఒక్క సంవత్సరాలుగా ఈ పోరాటంలో ఉన్నాము. మా పోరాటం ఫలించింది. న్యాయం నిలిచింది' అని హక్కుదారులు తమ సంతోషాన్ని మీడియాతో పంచుకున్నారు. న్యాయస్థానం, పోలీసులు, ప్రభుత్వ అధికారుల సహకారం వల్లే తమకు న్యాయం దక్కిందని, ఇది తమ కుటుంబానికి ఒక గొప్ప విజయమని వారు పేర్కొన్నారు. న్యాయస్థానం ఆదేశాలను ఏ రాజకీయ ఒత్తిడికీ తలొగ్గకుండా కచ్చితంగా అమలు చేసిన కరప పోలీసు బృందాన్ని, ముఖ్యంగా ఎస్ఐ తోట సునీత, ఆమె సిబ్బందిని స్థానికులు అభినందించారు. తమ విధుల్లో వారు చూపిన నిజాయితీకి కరప ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ విజయం కోసం కృషి చేసిన పోలీసు అధికారులకు, పౌర న్యాయస్థానానికి హక్కుదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరవై ఏళ్ల తర్వాత చట్టం చేసిన న్యాయం, నిస్సందేహంగా హక్కుదారులకు చిరస్మరణీయమైన విజయాన్ని ఇచ్చింది.

### గ్రామ బహిష్కరణ కేసును

# పక్కదోవ పట్టించిన పోలీసు అధికారులు

**రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రంపచోడవరం మండలంలోని నల్లరాయి క్వారీల వలన మా ఇల్లు నష్టపోతునడడం వలన ఐటిడిపిఓ రంపచోడవరం వారికి ఫిర్యాదు చేయడంతో మా కుటుంబాన్ని గ్రామం నుంచి వెలివేశారని రంపచోడవరం పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసినాము. ఐటీడీఏ, కలెక్టర్ పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయగా దానిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా గ్రామ బహిష్కరణ కేసును రంపచోడవరం పోలీస్ అధికారులు తప్పుదోవ పట్టించారని దిరిసనపల్లి గ్రామానికి చెందిన బల్లెం గంగాభవాని కుటుంబం ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై ఈనెల 17వ తారీఖున ఫిర్యాదు చేయగా, 17 18,19 మూడు రోజులు పాటు మా గ్రామంలోని పెద్దమనుషులు మీటింగ్ల పేరుతో మమ్మల్ని దుర్భసలాడటం, బెదిరించడం చేస్తూ, 19వ తేదీ నాడు గ్రామాన్ని నుంచి వెలివేయడం జరిగిందని, గ్రామానికి 20,000/- గ్రామ తప్పు డబ్బులు ఇవ్వాలని బెదిరించడం జరిగిందని. ఈ విషయంపై రంపచోడవరం పోలీస్ స్టేషన్,ఐటిడి పిఓ, కలెక్టర్ వారికి ఫిర్యాదు కూడా చేయడం జరిగింది. ఫిర్యాదు చేసిన వెంటనే గ్రామ బహిష్కరణ అంశంపై చర్యలు తీసుకోకుండా అధికారులు నిర్లక్ష్యం చేశారని వారు ఆవేదన వ్యక్తపరిచారు.

### మాకు న్యాయం చేయండి : ఎస్పీ సార్



దీనిపై మళ్లీ 24వ తేదీ నాడు ఐటిడిఏ పిఓకి ఫిర్యాదు చేయగా 24వ తేదీ సాయంత్రం నాలుగు గంటల సమయంలో మైనింగ్ ఏడి రంపచోడవరం ఎమ్మార్వో కొంత మంది అధికారులు గ్రామానికి వచ్చి క్వారీ వల్ల నష్టపోతున్న మా ఇళ్లను పరిశీలించడం జరిగింది అధికారి వారు కేవలం మేము క్వారీ వల్ల జరుగుతున్న నష్టం గురించి పరిశీలించడం కోసం మాత్రమే వచ్చేయమని స్పష్టంగా చెప్పి ఉన్నారు, అంతేకాక గ్రామస్తులు రెచ్చగొట్టి మాపై దాడి కూడా చేయించారు దీనిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా చేశాము. అయితే పోలీసులు తెలివిగా కక్షపూరితంగా దాడికి గురైన మాపై కూడా కేసులు కట్టడం బాధాకరమైన విషయమని వాళ్లు ఆవేదన వ్యక్తపరిచారు. గ్రామ బహిష్కరణ కేసు గురించి రంపచోడవరం ఎస్సైని అడగగా అటువంటిదేమీ లేదు ఆ కేసు లేదని దాటి వేయడం జరిగిందని అన్నారు. మరుసటి రోజు డీఎస్పీ కార్యాలయానికి పిలిపించి గ్రామ బహిష్కరణ కేసుకు సంబంధించి స్టేట్మెంట్స్ తీసుకోవడం జరిగింది, ఆ సమయంలో స్టేట్మెంట్ తీసుకున్న పోలీస్ అధికారి ఇంకా మీకు డిఎస్పి కార్యాలయంలో పని ఉండదు మీ కేసు పోలీస్ స్టేషన్లో చూసుకుంటారు మీ గ్రామానికి డిఎస్పీ వస్తారని నమ్మబలికారు. కానీ డిఎస్పీ, ఎస్పీ పాడేరు వారికి గ్రామ బహిష్కరణ జరగలేదని ఎమ్మార్వో మైనింగ్ ఏ డి వెళ్ళి విచారణ జరిపి ఉన్నారని, కావున గ్రామ బహిష్కరణకు ప్రత్యేక కేసు అవసరం లేదని, గొడవలు పడినందుకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి ఉన్నామని నివేదిక ఇవ్వటం జరిగింది. డీఎస్పీ ఇచ్చిన ఈ నివేదికను తాము వ్యతిరేకిస్తున్నామని, గ్రామ బహిష్కరణ జరగటం వాస్తవమని, రంపచోడవరం పోలీసు అధికారులు ఈ కేసును తప్పుదోవ పట్టించడానికి ఈ విధంగా వ్యవహరిస్తున్నారని, గ్రామ బహిష్కరణ చేసిన రోజు పోలీసులు చర్యలు తీసుకొని ఉండి ఉంటే మాపై ఎటువంటి దాడులు జరిగి ఉండేవి కాదని మా పై దాడులు జరగటానికి పోలీసులు కూడా కారకులేనని వారు ఆవేదన వ్యక్తపరిచారు. కక్షపూరితంగా మైనింగ్ మాఫియా, రంపచోడవరం ఎమ్మార్వో, మైనింగ్ ఏడి మాపై దాడి చేయించారని, దాడి చేయుటకు రంపచోడవరం ఎస్ఐ పరోక్ష సహకారం కూడా ఉన్నట్టు వారు ఆరోపించారు. కావున ప్రత్యేక అధికారిని నియమించి గ్రామ బహిష్కరణ కేసు నమోదు చేయాలని వారు ఈ సందర్భంగా ఎస్పీ ని కోరారు. అలాగే తమపై తమకు అండగా నిలిచిన వారిపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అదేవిధంగా తమపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని వారు అధికారులను కోరుతున్నారు.

# శంఖవరం-కత్తిపూడి రోడ్డు మరమ్మతులకు రూ.98 లక్షలు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం శంఖవరం నుండి కత్తిపూడి వరకు ఉన్న ఆర్ అండ్ బి రోడ్డుకి మరమ్మత్తులు చేపట్టేందుకు రూ. 98 లక్షలు మంజూరు అయ్యినట్టు పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల తెలుగు దేశం పార్టీ పూర్వ ప్రచార కార్యదర్శి పర్వత సురేష్ తెలిపారు. శంఖవరంలోని ఆయన స్వగృహంలో ఆదివారం ఉదయం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర హైవే రహదారులు - ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పోరేషన్ నుంచి అత్యవసర నిధులు 2025- 2026 కింద ప్రభుత్వ పరిపాలనా ఆమోదం లభించిందని ఆయన వెల్లడించారు. ఈ నిధులతో ఇప్పటికే ఉన్న తారు రోడ్డుపై ఉన్న గుంతలు, గోతులను పూడుస్తూ ఒంటి పొర రోడ్డును నిర్మిస్తారని ఆయన వెల్లడించారు. శంఖవరం - కత్తిపూడి 10 కిలో మీటర్ల పొడవునా ఉన్న ఈ రోడ్డులో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా వెంటనే నిర్మాణ పనులను చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదేశించారని సురేష్ పేర్కొన్నారు. రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా ఈశ్వరుడు (శివ), మండల తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు బద్ది రామారావు కూడా ఇదే విషయాన్ని పునరుద్ఘాటిస్తూ ఎన్నో ఏళ్లుగా అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు పునర్నిర్మాణానికి నిధులు మంజూరు కావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు రుణపడి ఉంటామని తెలిపారు. ఈ పాత్రికేయుల సమావేశంలో నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు కీర్తి వెంకట సుభాష్, మండల పార్టీ అధ్యక్షుడు ఈగల దేవుళ్ళు, కత్తిపూడి కర్షక సహకార సంఘం చైర్మన్ గాబు కృష్ణమూర్తి, రాష్ట్ర టి.ఎన్.ఎస్.ఎఫ్. కార్యనిర్వాహక కార్యదర్శి బద్ది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వారాహి లాడ్జిని ప్రారంభించిన ప్రత్తిపాడు శాసనసభ్యురాలు సత్యప్రభ

### అందరికీ అందుబాటులో ఉండేలా ధరలు నిర్ణయిస్తా - పొట్టి శ్రీనివాస్



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రత్తిపాడు అంబేద్కర్ భవనం ఎదురుగా ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో వారాహి లాడ్జి నూతన ప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారాహి లాడ్జి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం. శాసన సభ్యురాలు సత్య ప్రభ మాట్లాడుతూ ప్రత్తిపాడు పరిసర ప్రాంతాల వారికి దూర ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణికులకు కోర్టు కు హాజరయ్యేందుకు సమయానుకూలంగా అందుబాటు లో వచ్చి ఉండేందుకు ప్రత్తిపాడు బస్టాండ్ సమీపంలో వారాహి లాడ్జి ఉందని యాజమాన్యానికి ఈ వారాహి లాడ్జి లాభదాయకంగా నడవాలని సంతోషం వ్యక్తపరిచారు. అనంతరం వారాహి లాడ్జ్ ఓనర్ పొట్టి శ్రీనివాసులు మీడియా ముఖంగా మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే సత్యప్రభ కి ధన్యవాదాలు తెలుపారు. ప్రత్తిపాడు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రారంభించిన వారాహి లాడ్జిని ప్రత్తిపాడు పరిసర ప్రాంతాల వారు అందరూ వినియోగించుకునేలా అందుబాటు ధరలు నిర్ణయిస్తామని లాడ్జి అసాంఘిక కార్యక్రమాలకి తావు లేకుండా మత్తు పదార్థాలు సేవించిన వారికి నిరాకరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు యాళ్ళ జగదీష్, కొమ్ముల కన్నబాబు, మాజీ సర్పంచ్, మూర సత్యనారాయణ వరప్రసాద్, పోలిశెట్టి శ్రీను, సిహెచ్‌సి చైర్ పర్సన్ వెలుగుల నాని, మాజీ సర్పంచ్,యాళ్ళ విశ్వేశ్వరరావు, చలంకూరి భాను, తదితర ముఖ్య నాయకులు హాజరయ్యారు.

# ప్రకృతి సిద్ధమైన వైద్యం ఆయుర్వేదం



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకృతి సిద్ధమైన ఆయుర్వేదం వ్యాధి నిరోధక శక్తిని పెంచడమే గాక ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా చేస్తుందని ప్రముఖ ఆయుర్వేద వైద్యురాలు రమ్య పేర్కొన్నారు. స్థానిక బోటు క్లబ్ ఉద్యానవనంలో చంద్ర మెడికల్ కేర్ సౌజన్యంతో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవుని మనుగడలో ఆయుర్వేద0 మమేకమై ఉందని దానిని వినియోగించుకుంటే మంచి ఆరోగ్యం మన సొంతమవుతుందన్నారు. మన చుట్టూ పెరిగే మొక్కలు అన్నింటిలో ఔషధ గుణాలు ఉన్నాయని వాటిపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. అనంతరం డాక్టర్ రమ్య వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్న ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్, కె.శ్రీరామరాజు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# తోలేటి వారి పుట్టినరోజు వేడుకలో మురళీ కృష్ణంరాజు



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రత్తిపాడు మండలం ప్రత్తిపాడు మురళిరాజు గెస్ట్ హౌస్ దగ్గర జరుగుచున్న ఒమ్మంగి గ్రామానికి చెందిన తోలేటి శేఖర్ కుమారుడు రామ్ క్రిషన్ మొదటి పుట్టినరోజు వేడుక ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు & ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు, రామ్ క్రిషన్ తో కేక్ కటింగ్ చేయించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి రామ్ క్రిషన్‌ని ఆశీర్వదించారు. అనంతరం పుట్టినరోజు వేడుకకు వచ్చిన ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి నియోజకవర్గం ప్రజలందరూ పైన తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ముదునూరి సీతారామరాజు, వైస్సార్సీపీ సీనియర్ నాయకులు గంట గంగబాబు, గంట లచ్చబాబు(బుజ్జి),నార్లంక వెంకన్నబాబు,మెత్తన వీరబాబు,ముమ్మిడి వీరబాబు, సుంకర తమ్మారావు, ఎంపీటీసీ నానిపల్లి చంటి, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు, నల్ల వెంకటేష్, కోలా సూరిబాబు, దోమలంక బాబ్జి, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధ దంపతులకు ఇంటి నిర్మాణానికి

# జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రేకులు, పైపులు వితరణ




**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** చింతూరు మండల కేంద్రంలోని ఓడ బజార్లో గత వరదలకు పచ్చిక నారాయణ వృద్ధ దంపతుల ఇల్లు పడిపోవడంతో నిలువ నీడ లేక ఇబ్బంది పడుతున్న వృద్ధ దంపతుల కష్టాలను తెలుసుకొని జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మొహమ్మద్ జమాల్ ఖాన్ ఆదివారం ఇంటి నిర్మాణానికి కావాల్సిన పది సిమెంట్ రేకులు, 10 ఇనుప పైపులను ట్రస్ట్ అద్వర్యం లో సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ వహీద్, జాన్ సుందర్, షేక్ షరీఫ్,ఖలీద్ తదితరులు పాల్గొన్నారు.



# గోదావరి పుష్కరాలు-2027 సమీక్ష

### పలు అంశాలపై విస్తృతంగా చర్చ

### పాల్గొన్న కలెక్టర్, మంత్రి, ఎంపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు అధికారులు




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి పుష్కరాలు 2027 ఏర్పాట్లపై తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధ్యక్షతన జరిగిన సమన్వయ సమావేశంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా విభాగాల వారీగా సాగుతున్న ప్రాథమిక పనులు, అవసరమైన సౌకర్యాలు, రద్దీ నియంత్రణ, భద్రతా చర్యలు, తాగునీరు, వసతి ఏర్పాట్లు మరియు శానిటేషన్ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించాము. పుష్కరాల సందర్భంగా లక్షలాది భక్తులు రానున్న నేపథ్యంలో తక్షణమే చేపట్టాల్సిన పనులు, దీర్ఘకాల ప్రణాళికలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండే విధంగా సమగ్ర వ్యూహంపై సూచనలు కలెక్టర్ తో కలిసి సమీక్షించాము. ఈ కార్యక్రమంలో ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి, ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, పేరాబత్తుల రాజశేఖరం, రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటరావు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి , రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, రుడా ఛైర్మెన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మరియు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో

# వ్యక్తి దారుణ హత్య

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం దోసకాయలపల్లి గ్రామంలో మాంసం విక్రయించే పిల్లి ఆనంద్(30)ను వరుసకు బావమరిది అయ్యే రాజ్ కమల్ (బొబ్బిలిలంక) హతమార్చినట్లు మృతుడి బంధువులు తెలిపారని కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ వై సత్య కిషోర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఆదివారం ఉదయం దోసకాయలపల్లిలో సచివాలయం వద్ద మాంసం విక్రయించే ఆనంద్ మేకను తీసుకొని సచివాలయం వద్దకు మోరు వేయించుకునే నిమిత్తం వెళుతుండగా సీతానగరం మండలం బొబ్బిలిలంక గ్రామానికి చెందిన రాజ్ కమల్, ఆనంద్ పై దాడి చేసి కిరాతకంగా హతమార్చినట్లు ఆయన తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామన్నారు. మృతుడి బంధువులు రాజ్ కమల్ తో పాటు మరికొద్దిమంది ఉన్నారని, దర్యాప్తు చేసి వారిని కఠినంగా శిక్షించాలని తెలిపారన్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై చిరంజీవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా చల్లాశంకరరావు పుట్టినరోజు వేడుకలు, పలు సేవలు

### చల్లా సామాజిక సేవలు స్ఫూర్తిదాయకం - ఎస్సీ హాస్టల్ బాలికలకు పాదరక్షలు పంపిణీ - అయ్యప్ప ఆలయంలో అన్న ప్రసాద వితరణ







**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వితరణశీలి, ది.ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ చల్లాశంకరరావు సమాజానికి అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు. చల్లా శంకరరావు పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్యామలానగర్‌లోని వారి ఇంటి వద్దకు ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్‌లు, సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపార ప్రముఖులు చేరుకుని చల్లా శంకరరావుకు బొకేలు, పూలమాలలు, శాలువాలు కప్పి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అభిమానుల మధ్య శంకరరావు కేక్ కట్ చేశారు. బిసిఎన్ ఛానల్ ఎండి పంతకం కొండలరావు, టిడిపి నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు, ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్‌లు యెనుముల రంగబాబు, పిల్లి శ్యాం, యాళ్ళ వెంకట్రావు, యర్రమోతు ధర్మరాజు, తురకల నిర్మల, బుడ్డిగ రవి, పడాల శ్రీను, ముగిడి శ్రీనివాసరావు(పెదకాపు), కప్పల సూర్యప్రకాష్, సింగంపల్లి వెంకటరామకృష్ణ, మాజీ కార్పొరేటర్‌లు గొర్రెల సురేష్, మెరపల శ్యామలరావు, కిలపర్తి శ్రీనివాస్, బ్యాంక్ మాజీ డైరక్టర్ సూరంపూడి శ్రీహరి, మాజీ వైస్ ప్రెసిడెంట్ పోలాకి పరమేస్, టిడిపి నాయకులు తుల్లి పద్మావతి, మీసాల నాగమణి, చౌదరి, తలారి భాస్కర్, శీత త్రినాధ్, చీకట్ల సత్యనారాయణ, జాంపేట బ్యాంక్ డైరెక్టర్ జామిశెట్టి గాంధీ, ఇన్నిసుపేట బ్యాంక్ డైరెక్టర్ కురుమిల్లి స్వరూప్, ఆర్యాపురం బ్యాంక్ సిఇవో సుధాకర్, ఇతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొని చల్లా శంకరరావు దంపతుల చేత కేక్ కట్‌చేయించారు. వారిని సత్కరించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. సేవా కార్యక్రమాలలో భాగంగా స్థానిక గణేష్ చౌక్ వద్ద గల ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థినులకు ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ యాళ్ళ వెంకట్రావు తన కామన్ గుడ్ ఫండ్ నుంచి సమకూర్చిన పాదరక్షలను చల్లా శంకరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శంకరరావు



స్పందిస్తూ తన పుట్టినరోజును పురస్కరించుకుని హాస్టల్‌లోని విద్యార్థినులకు పాదరక్షలను సమకూర్చడం అభినందనీయమన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతైనా అవసరమన్నారు. బ్యాంక్ డైరెక్టర్ యెనుముల రంగబాబు మాట్లాడుతూ చల్లా శంకరరావు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలే తమకు స్ఫూర్తి అన్నారు. ఆయన బ్యాంక్ ద్వారా వచ్చే గౌరవ వేతనాన్ని పేద విద్యార్థుల చదువులకు ఖర్చుచేయడమే కాకుండా అనేక సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఇప్పటి వరకు రూ.4.50లక్షలు విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు పంపిణీ చేశారన్నారు. చల్లా స్ఫూర్తితోనే తాము పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హితకారిణి సమాజం ఛైర్మన్ డాక్టర్ యాళ్ళ ప్రదీప్ సుకుమార్, బ్యాంక్ డైరెక్టర్‌లు యాళ్ళ వెంకట్రావు, పడాల శ్రీను, పిల్లి శ్యాం, తురకల నిర్మల, హాస్టల్ సంక్షేమాధికారిణి వాసంశెట్టి సత్యవాణి, ఎస్‌కెవిటి మేనేజ్‌మెంట్ స్టాఫ్ శిరికి రాజబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే చల్లా శంకరరావు తన పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక గౌతమఘాట్ రోడ్డులోని శ్రీ ధర్మశాస్త ఆధ్యాత్మిక సంస్థ, అయ్యప్ప ఆలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

# కనుల పండుగగా శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణ మహోత్సవం

### నున్న ఆధ్వర్యంలో భక్తులకు అన్న వితరణ





**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి షష్టి మహోత్సవంలో భాగంగా ఆదివారం స్వామి అమ్మవార్ల కళ్యాణ మహోత్సవాన్ని కనులు పండుగగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఆలయ వేద పండితులు కాళ్లకూరి సుబ్రహ్మణ్యేశ్వర శర్మ ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్ల కళ్యాణ మహోత్సవాన్ని అశేష భక్తుల నామస్మరణలతో, వేద పండితుల మంత్రోచ్ఛారణలతో ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించిన,కళ్యాణ మహోత్సవాన్ని యావన్మంది భక్తులు కనురాల తిలకించి, భక్తి పరవశంతో పరవశించిపోయారు. సుమారు 255 మంది దంపతులు ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొని, స్వామి అమ్మవార్ల కళ్యాణాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థ,ప్రసాదాలు స్వీకరించారు. కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న యావన్మంది భక్తులకు నున్న తిరుమలరావు దంపతుల ఆధ్వర్యంలో అన్న వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు వుల్లి బుజ్జిబాబు, నీరుకొండ బాబ్జి, బదిరెడ్డి దొర, తాడి హరిచంద్రప్రసాద్ రెడ్డి, కోలా వీరేష్, కేతినేడి అశోక్, ముసిణి శ్రీను, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్న జక్కంపూడి రాజా

### ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కారం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని వైయస్సార్సీపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కోరుకొండ సుబ్రహ్మణ్యేశ్వర షష్టి మహోత్సవంలో భాగంగా వైయస్ఆర్ సీపీ నాయకులు జక్కంపూడి రాజా స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జక్కంపూడి రాజాకు పూలమాలవేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు నీరుకొండ బాబ్జి, తాడి హరిచంద్ర ప్రసాద్ రెడ్డి, కేతినేడి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# బాలోత్సవంలో ఆదిత్య ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు అభినందనీయం





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలకు చెందిన ఎన్.ఎస్.ఎస్, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్‌లు గత మూడు సంవత్సరాలుగా నిర్వాహకులు కృష్ణకుమార్ నేతృత్వంలో జరుగుతున్న గోదావరి బాలోత్సవ్ ఎస్.కె.వి.టి గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వం లో జరుగుతున్న ఈ సాంస్కృతిక కార్యక్రమాల్లో సహకరిస్తున్న ఆదిత్య వాలంటీర్ల విజయం వెనుక,ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం పి.ఆర్. ఓ పువ్వల ఆనంద్ సహకారం 100 శాతం ఉన్నదని, అందుకే తమ ఆదిత్య వాలంటీర్లు దీనిలో పాల్గొనడం జరిగిందని డాక్టర్ జి.వి.ఎస్. నాగేశ్వరావు ఈ సందర్భంగా చెప్పారు. ఆదిత్య వాలంటీర్లు ఈ మూడవ ఏడాది బాలోత్సవంలో ప్రతి కార్యక్రమంలో పాల్గొని,పలువురి ప్రశంసలు పొందినట్లుగా వీరు చెప్పారు.ఆదివారం సెలవు కూడా తీసుకోకుండా, ఒక ప్రక్క తమ విద్య ఉద్యోగ విజయాలలో ముందుంటూనే,సేవా భావంతో బాలోత్సవంలో తమకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారనీ మరో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి హెచ్.వి.రమాదేవి తెలియజేశారు.నిరంతరం సమాజ సేవలో పాల్గొంటున్న తమ వాలంటీర్లను రాజమండ్రి ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, ప్రిన్సిపాల్స్ సిహెచ్ ఫణి కుమార్, ఎస్. కె. ఎన్.రెహమాన్, డి.రామకృష్ణ, ఎం.చంద్రశేఖర్లు అభినందించారు.

# గోదావరి బాలోత్సవంలో అబ్బురపర్చిన చిన్నారుల సృజనాత్మక

### విజేతలకు బహుమతుల ప్రదానం - ముగిసిన గోదావరి బాలోత్సవ వేడుకలు






**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** చిన్నారుల కేరింతలు... ముద్దులొలికే మాటలు... అబ్బురపర్చిన చిన్నారుల వివిధ రకాల వేషధారణలు.. ఉర్రూతలూగించేలా జానపద నృత్యాలు చిన్నారుల్లో నిబిడీకృతమై శాస్త్ర సాంకేతికపరమైన సైన్సు ప్రయోగాలు.. కోలాటాల మధ్య గోదావరి బాలోత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. శని ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన గోదావరి బాలోత్సవంలో ఆదివారం సాయంత్రం వరకూ వేలాది మంది చిన్నారులు వివిధ రంగాల వారీగా తమలో ఉన్న సృజనాత్మకలను వెలికితీసేందుకు ప్రయత్నాలు చేశారు. మొత్తంగా 2 రోజుల పాటు సుమారుగా 10వేల మందికి పైబడి పిల్లలు పాల్గొన్నారు. దాదాపు 100 మంది వివిధ విభాగల్లో న్యాయనిర్ణేతలుగా వ్యవహారించారు. గోదావరి బాలోత్సవంలో తమ ప్రతిభను చాటుకునేందుకు చిన్నారులు క్లాసికల్ డాన్స్, సైన్సు ప్రయోగాలు, గణిత ఫజిల్స్, జానపద నృత్యాలు, కోలాటం, లఘునాటికలు, జానపద గీతాలాపన, దేశభక్తి గీతాలాపన, విచిత్ర వేషదారణలు, బుర్రకథలతోపాటు, కార్టూన్లు, మట్టితో బొమ్మలు తయారీ, చిత్రలేఖనం పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో చిన్నారుల సంఖ్యతోపాటు, వారి తల్లీదండ్రుల, ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొనడంతో ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాల ఆవరణ పండగ వాతావరణం మధ్య ఘనంగా గోదావరి బాలోత్సవం ముగిసింది.



**విజేతలకు బహుమతుల ప్రదానం**

గత రెండు రోజులుగా నీర్వహించిన గోదావరి బాలోత్సవంలో చిన్నారులకు వివిధ రంగాల వారీగా జూనీయర్స్, సీనీయర్స్ విభాగంలో నీర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం జరిగింది. బహుమతుల ప్రదానం కార్యక్రమంలో యూనీయన్ బ్యాంకు రీజనల్ హెడ్ ఎ.విశ్వేశ్వరరావు, ఎల్ఐసి సీనీయర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహూ, ఆపుస్మా జిల్లా కార్యదర్శి పి.కళ్యాణ్ రెడ్డి, ఇండియన్ నేవి కెప్టెన్, ప్రముఖ చిత్రకారులు దామెర్ల రామారావు మనవుడు డెన్నిస్ దామెర్ల, స్వామి యాడ్స్ అధినేత జి.భాస్కర్, అమరావతి బాలోత్సవం ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.క్రాంతి కుమార్, గోదావరి బాలోత్సవం ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.తులసి, గోదావరి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి దాసరి సాయిబాబా, ఎస్టిఎఫ్ఐ జాతీయ కార్యదర్శి ఎన్.అరుణకుమారి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ.షరీఫ్, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు కోలా సత్యనారాయణ, తదితరుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎల్ఐసి సీనీయర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహూ మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగిన గోదావరి బాలోత్సవం ఎంతో ఉత్సాహపూరిత వాతావరణవంలో జరిగిందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు, కళారంగాలపట్ల ఆసక్తినీ పెంచుకోవాలన్నారు. అందుకు గోదావరి బాలోత్సవం దోహదం చేస్తుందన్నారు. పాఠశాలల యాజమాన్యాలు సైతం విద్యతోపాటు, విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు కృషి చేయాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం ఆర్గనైజర్స్ నవీనకుమారి, ఆనంద్, వినోద్, పట్నాయక్, మురళి, అంజలి, గొల్లపల్లి సత్యనారాయణ, బుద్ధా శ్రీంవాస్, విజరుబాబు, రాజేష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళ వైద్యానికి వాట్సప్ గ్రూప్ మిత్ర బృందం సహాయం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎ.ఎస్.ఓ జోడాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పెద్దవం గ్రామానికి చెందిన జవ్వాది గంగభవానికి రెండు కాళ్లు ప్రమాదవశాత్తు విరిగిపోయాయి.ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం వెంకటేశ్వ రావు వాట్సాప్ స్టేటస్ ద్వారా స్నేహితులు, ఉద్యోగస్తులు, శ్రేయాభిలాషులు అనేక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జోడాల వెంకట్, రమాదేవి దంపతులు,దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ ప్రత్తిపాటి నాగరాజు,కిషోర్ లు పాల్గొన్నారు.

క్రీడా వాయిస్

సరిగ్గా రెండు వారాల్లో..

# హైదరాబాద్‌కు ఫుట్ బాల్ లెజెండ్




ప్రపంచ ఫుట్ బాల్ చరిత్రలో గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (గోట్)... దాదాపు మూడు దశాబ్దాల తర్వాత అర్జెంటీనా జట్టుకు ప్రపంచ కప్ అందించిన కెప్టెన్... ప్రపంచంలో అత్యంత ఫాలోయింగ్ ఉన్న ఫుట్ బాలర్... లయోనల్ మెస్సీ భారత పర్యటనకు వస్తున్నాడు. సాధారణంగా ఫుట్ బాల్ క్రేజ్ అంతగా లేని భారత్ లోనూ ప్రతి ఒక్క క్రీడాభిమానికీ సుపరిచితుడు మెస్సీ. తన సమ్మోహన ఆటతీరుతో ఫుట్ బాల్ లో ప్రత్యేక పేజీ లిఖించుకున్న ఆటగాడు ఇతడు. అంతటి మెస్సీ భారత్ కు రావడం అంటే చాలా అరుదే. పైగా ప్రపంచ కప్ వచ్చే ఏడాది ఉండగా.. అర్జెంటీనా జట్టు డిఫెండింగ్ చాంపియన్ హోదాలో పోటీ పడుతుండగా.. మరోవైపు లీగ్ షెడ్యూల్ ను సరిచూసుకుంటూ భారత్ లో అడుగు పెట్టనున్నాడు మెస్సీ. ఇక్కడ మరో విశేషం ఏమంటే.. కొన్ని నెలల కిందట వరకు కేరళలో మెస్సీ సారథ్యంలో అర్జెంటీనా జట్టు పర్యటన ఉంటుందని కథనాలు వచ్చాయి. ఆ రాష్ట్రంలో ఫుట్ బాల్ మ్యాచ్ కూడా ఆడతాడని ప్రకటించారు. అనూహ్యంగా ఆ టూర్ క్యాన్సిల్ అయింది. మెస్సీ పర్యటనకు మన హైదరాబాద్ వేదిక కానుంది. ఇంతకూ అతడు వచ్చేది ఏయే తేదీల్లో తెలుసుకోండి..

**డిసెంబరు రెండో వారాంతంలో..**

కేరళ వంటి విపరీతమైన ఫుట్ బాల్ క్రేజ్ ఉన్న రాష్ట్రాన్ని కాదని మెస్సీ హైదరాబాద్ రానుండడం విశేషమే. ఒక విధంగా ఇది తెలుగు రాష్ట్రాల వారికి క్రేజీ న్యూస్ కానుంది. అయితే, మెస్సీ టూర్ జట్టుతో కాదు.. కేవలం ఒంటరిగా. కేరళ టూర్ క్యాన్సిల్ నేపథ్యంలో దక్షిణ భారత ప్రజలను నిరుత్సాహ పరచకుండా హైదరాబాద్ ను ఎంపిక చేశారు. చెన్నై, బెంగళూరు వంటి నగరాలను కూడా కాదని భాగ్య నగరానికి అవకాశం ఇచ్చారు. ఈ మేరకు డిసెంబరు 13న మెస్సీ హైదరాబాద్ వస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. అభిమాన ఆటగాడిని చూసేందుకు ప్రజలు ఎంతో ఉత్సాహంగా ఉన్నారని పేర్కొన్నారు.దేశంలోని నాలుగు నగరాల్లో... మెస్సీ హైదరాబాద్ తో పాటు కోల్ కతా, ఢిల్లీ, ముంబైలోనూ పర్యటించనున్నాడు. అంటే దేశంలోని నాలుగు మూలల్లో అతడి టూర్ ఏర్పాటు చేశారు. వాస్తవానికి నవంబరు 17నే కేరళలో మెస్సీ మ్యాచ్ ఉంది. అది రద్దయింది. వీటిలో కోల్ కతా ఫుట్ బాల్ కు పెట్టింది పేరు. ముంబై సరేసరి. మరో నగరమైన ఢిల్లీ దేశ రాజధాని. అక్కడా మెస్సీ అంటే భిమానించని వారు ఎవరూ ఉండరు.

**ప్రయివేటు జెట్‌లో..**

అంతర్జాతీయ ఫుట్ బాలర్లు అంటే వేల కోట్లకు అధిపతులు. సొంత విమానాలు కలిగినవారు. ఇప్పుడు మెస్సీ ప్రైవేటు జెట్ లోనే భారత్ కు వస్తున్నాడు. డిసెంబరు 13న కోల్ కతా వెళ్తాడు. అటు తర్వాత హైదరాబాద్ వస్తాడు. గచ్చిబౌలి స్టేడియంలో కానీ, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం ఉప్పల్ లో గాని అతడి కార్యక్రమం ఉండనుంది. డిసెంబరు 14న ముంబై, 15 ఢిల్లీ టూర్ చేస్తాడు. మెస్సీ చివరిగా 2011లో భారత్ లో పర్యటించాడు. అప్పటికి అర్జెంటీనా ప్రపంచ విజేత కాదు. మెస్సీ కూడా పెద్దగా పాపులర్ కాదు.

# దక్షిణాఫ్రికాతో ఉత్కంఠ పోరులో.. భారత్‌దే గెలుపు



దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో ప్రత్యర్థిపై టీమ్‌ఇండియా 17 పరుగుల తేడాతో గెలుపొందింది. భారత్ నిర్దేశించిన 350 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా 49.2 ఓవర్ల వద్ద 332 పరుగులకు ఆలౌటైంది. మాథ్యూ (72), యాన్సన్ (70), బాష్ (67) కంగారు పెట్టినా.. గెలుపు భారత్ వశమైంది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో టీమ్‌ఇండియా 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

**ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కోహ్లీ..**

దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ అనగానే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీపైనే అందరి దృష్టి ఉంది. అభిమానుల అంచనాలను అందుకొంటూ మరోసారి వీరిద్దరూ చెలరేగిపోయారు. ఆసీస్‌పై మంచి ఫామ్ కనబరిచిన రోహిత్ (57) మళ్లీ హాఫ్ సెంచరీ సాధించాడు. అయితే, విరాట్ కోహ్లీ (135: 120 బంతుల్లో 11 ఫోర్లు, 7 సిక్స్‌లు) ఆటే హైలైట్. సాధారణంగా కోహ్లీ వన్డేల్లో సిక్స్‌లు కొట్టడం కాస్త తక్కువే. ఎక్కువగా ఫోర్లపైనే దృష్టి పెడతాడు. ఈసారి అందుకు భిన్నంగా సఫారీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. సిక్స్‌ల వర్షం కురిపించాడు. రోహిత్‌తో కలిసి సెంచరీ భాగస్వామ్యం నిర్మించిన విరాట్.. భారత్ స్కోరు 350కి చేరువగా రావడంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఈ క్రమంలో శతకం చేసిన విరాట్ కోహ్లీ ప్రపంచ క్రికెట్‌లో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఒకే ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాడిగా ఘనత సాధించాడు. వన్డే సిరీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తోన్న కేఎల్ రాహుల్ (60) ఈ మ్యాచ్ ఆరంభంలో కాస్త ఇబ్బంది పడినా.. చివరికి హాఫ్ సెంచరీ సాధించాడు. ఇక ఆఖర్లో రవీంద్ర జడేజా (32: 20 బంతుల్లో) దూకుడు ప్రదర్శించాడు. అయితే, యశస్వి జైస్వాల్ (18), రుతురాజ్ గైక్వాడ్ (8), వాషింగ్టన్ సుందర్ (13) విఫలమయ్యారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో యాన్సన్, బర్గర్, బార్ట్‌మన్, బాష్ రెండేసి వికెట్లు పడగొట్టారు.

**ఆరంభంలోనే సఫారీలకు దెబ్బ..**

భారత్ నిర్దేశించిన భారీ లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికాకు షాక్ మీద షాక్ తగిలింది. సఫారీ జట్టును హర్షిత్ రాణా దెబ్బ కొట్టాడు. ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లో రికెల్టన్ (0), డికాక్ (0)ను వెనువెంటనే పెవిలియన్‌కు చేర్చాడు. ఆ తర్వాత మార్‌క్రమ్ (7) ఐదో ఓవర్లో అర్ష్‌దీప్ బౌలింగ్‌లో కీపర్ రాహుల్‌కి క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. అప్పటికే క్రీజులో ఉన్న మాథ్యూ.. డిజార్జి(39)తో కలిసి నాలుగో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యం అందించాడు. 15వ ఓవర్లో డిజార్జి.. కుల్‌దీప్ యాదవ్‌కు వికెట్ల ముందు దొరికిపోయాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన బ్రెవిస్ (37) 22వ ఓవర్లో హర్షిత్ వేసిన బంతిని సిక్స్‌గా మలిచే క్రమంలో రుతురాజ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు.

**కుల్‌దీప్ సూపర్ బౌలింగ్..**

అప్పటికి దక్షిణాఫ్రికా స్కోరు 130/5. భారత్ త్వరగానే మ్యాచ్‌ను ముగిస్తుందని అభిమానులు భావించారు. అనూహ్యంగా మాథ్యూ - యాన్సన్ జోడీ ఎదురుదాడికి దిగింది. వీరిద్దరూ కలిసి 97 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే, 34వ ఓవర్లో కుల్‌దీప్ వీరిద్దరిని పెవిలియన్‌కు పంపించి భారత్‌లో ఒక్కసారిగా ఊపుతీసుకొచ్చాడు. ఆ తర్వాత వచ్చిన సుబ్రయెన్ (17)ను కూడా కుల్‌దీప్ ఔట్ చేశాడు. చివర్లో బాష్ పోరాడినా ఫలితం దక్కలేదు. ఆఖరి ఓవర్‌లో ప్రసిద్ధ్ వేసిన బంతిని భారీషాట్‌కు యత్నించి రోహిత్ చేతికి చిక్కి బాష్ పెవిలియన్‌కు చేరాడు. దీంతో భారత్ విజయం ఖాయమైంది. టీమ్‌ఇండియా బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ 4, హర్షిత్‌రాణా 3, అర్ష్‌దీప్ 2, ప్రసిద్ధ్ ఒక వికెట్ తీశారు.

**మరికొన్ని విశేషాలు..**

వన్డేల్లో 352 సిక్స్‌లు కొట్టిన రోహిత్ శర్మ ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. 277 మ్యాచుల్లోనే షాహిద్ అఫ్రిది (351)ని రోహిత్ అధిగమించాడు.

వన్డేల్లో ఇరు జట్లు కలిపి అత్యధిక పరుగులు నమోదు చేసిన మ్యాచ్‌గా (681 పరుగులు) నిలిచింది.

సినీ వాయిస్ CINEMA

# చుక్కల్లో ప్రభాస్ స్పిరిట్ డిజిటల్ డీల్




సందీప్ వంగా ఇంటెన్స్ కాప్ డ్రామా స్పిరిట్ చిత్రీకరణ ఇటీవలే ప్రారంభమైన సంగతి తెలిసిందే. డార్లింగ్ ప్రభాస్ ఈ చిత్రంలో సీరియస్ కాప్ పాత్రలో నటిస్తున్నారు. ఇది భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ కేటగిరీలో సందీప్ మార్క్ ఎమోషనల్ డెప్త్ తో కొనసాగే చిత్రమని కథనాలొస్తున్నాయి. అర్జున్ రెడ్డి, యానిమల్ తరహాలో ఇంటెన్స్ సీన్లకు ఈ చిత్రంలో కూడా కొదవేమీ ఉండదు. అంతటి డెప్త్ ఉన్న పాత్రలో ప్రభాస్ నటిస్తున్నాడు. పోలీసాఫీసర్ జీవితంలో ఎమోషనల్ డ్రామా ఇందులో హైలైట్ గా ఉండనుంది. ఇందులో కూడా అనీల్ కపూర్ నటించే వీలుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రభాస్-సందీప్ వంగా కలయికలోని ఈ చిత్రాన్ని టి- సిరీస్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ఈ సినిమా పాన్ వరల్డ్ ని ఢీకొట్టే కంటెంట్ తో రూపొందుతోందని, బడ్జెట్ కూడా అసాధారణంగా ఉంటుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఈ భారీ ప్రాజెక్ట్ పై ఉన్న అంచనాల దృష్ట్యా ఇప్పటికే డిజిటల్ రైట్స్ డీల్ పూర్తయిందని తెలుస్తోంది. పాపులర్ ఓటీటీ అన్ని భాషల డిజిటల్ స్ట్రీమింగ్ హక్కుల కోసం రూ.160కోట్లు చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకుందని సమాచారం. అరుదైన ట్రాక్ రికార్డ్... సందీప్ వంగాకు ఒక అరుదైన ట్రాక్ రికార్డ్ ఉంది. విజయ్ దేవరకొండ లాంటి రైజింగ్ స్టార్ తో సందీప్ వంగా అర్జున్ రెడ్డి చిత్రాన్ని ఎమోషనల్ బ్లాక్ బస్టర్ గా మలిచాడు. షాహిద్ కపూర్ (కబీర్ సింగ్), రణబీర్ కపూర్ (యానిమల్) లాంటి టాప్ హీరోలను ఎమోషనల్ డెప్త్ ఉన్న కంటెంట్ తో సందీప్ రెడ్డి హై పిచ్ కి తీసుకుని వెళ్లాడు. సందీప్ వంగాతో పని చేసాకే ఆ హీరోల రేంజ్ మరింత పెరిగింది. ఇమేజ్ అమాంతం మారిపోయింది. ఇప్పుడు అదే అంశం వంగాపై అంచనాలను పెంచుతోంది. అతడు ప్రభాస్ పాత్రను ఏ విధంగా తీర్చిదిద్దాడు? యాక్షన్ డ్రామాలో కాప్ పాత్రను ఏ రేంజుకు చేర్చుతాడు? అన్నది ఉత్కంఠగా మారింది. సందీప్ తో పని చేసిన హీరోలందరికీ ఇప్పటివరకూ గొప్ప పేరొచ్చింది. ఇప్పుడు ప్రభాస్ లాంటి మ్యాసివ్ ఫాలోయింగ్ ఉన్న పాన్ ఇండియన్ స్టార్ ని ఎలా చూపించబోతున్నాడు? అన్నది ఉత్కంఠగా మారింది. రణబీర్ కపూర్ -యానిమల్-ని పోస్టర్, టీజర్, ట్రైలర్ దశలోనే పరాకాష్ఠకు తీసుకెళ్లాడు. రణబీర్ ని ఏదో కొత్తగా చూపిస్తున్నాడనే ఫీలింగ్ ని కలగజేయడంలో అతడు విఫలం కాలేదు. అప్పటివరకూ రెగ్యులర్ చాక్లెట్ బోయ్ లాగా కనిపించిన రణబీర్ ని యాక్షన్ హీరోగా, ఒక రెబల్ గా చూపించిన తీరుకు అందరూ ఆశ్చర్యపోయారు. ఇప్పుడు ప్రభాస్‌ని కూడా అందరూ ఆశ్చర్యపోయేలా అతడు తెరపై ఎలివేట్ చేస్తాడా? అన్నది వేచి చూడాలి.

# మెగా అభిమానుల్ని 20 ఏళ్లు వెనక్కి!



మెగాస్టార్ చిరంజీవి కథనాయకుడిగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో మన శంకరవరప్రసాద్ గారు తెరెక్కుతోన్న సంగతి తెలిసిందే. చాలా కాలం తర్వాత చిరంజీవి నటిస్తోన్న హిలేరియస్ ఎంటర్ టైనర్ ఇది. సినిమా ఎలా ఉంటుంది? అన్నది ప్రారంభానికి ముందే చిరు లీక్ ఇచ్చేసారు. కొదండ రామిరెడ్డి సినిమాల తరహాలోనే అనీల్ సినిమా ఉండబోతుందని చెప్పకనే చెప్పారు. చిరంజీవి తనదైన మార్క్ హాస్యభరిత పాత్రలో అలరించనున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ దశలో ఉంది. ఇప్పటికే చిత్రీకరణ ముగింపు దశకు చేరుకుంది.

**అభిమానులకు డబుల్ బొనాంజ:**

అన్ని పనులు పూర్తి చేసి సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ నేపథ్యంలో సినిమా గురించి మరో ఇంట్రెస్టింగ్ విషయాన్ని అనీల్ రివీల్ చేసారు. గత సంక్రాంతి కంటే ఈసారి డబుల్ బొనాంజ ఉంటుందన్నారు. గత సంక్రాంతికి అనీల్ డైరెక్టర్ చేసిన సంక్రాంతి వస్తున్నాం ఎంత పెద్ద విజయం సాధించిందో తెలిసిందే. వెంకటేష్ ని ఏకంగా 300 కోట్ల క్లబ్ లో కూర్చోబెట్టిన చిత్రమది. అనీల్ తాజా ప్రకటన నేపథ్యంలో అంచనాలు పీక్స్ కు చేరుతున్నాయి. అనీల్ లెక్క తప్పకుడదంటే సినిమా ఏకంగా 500 కోట్ల వసూళ్లతో మెగాస్టార్ కెరీర్ కి ఆల్ టైమ్ హిట్ ఇవ్వాల్సి ఉంటుంది. చిరు సక్సెస్ ఫార్ములాతోనే: ఆ అంశాన్ని దృష్టిలో పెట్టుకునే అనీల్ డబుల్ బొనాంజ ప్రకటన చేసినట్లు అభిమానులు భావిస్తున్నారు. అలాగే చిరంజీవిని అభిమానులు ఎప్పటి నుంచో చూడాలనుకుంటోన్న పాత్రలో చూస్తారని మరోసారి చెప్పకనే చెప్పారు. అన్నయ్యకు ఈ జానర్ ఎంతో నచ్చిన చిత్రంగా పేర్కొన్నారు. ఇలాంటి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ లో చిరంజీవి నటించి 20 ఏళ్లు దాటిందన్నారు. దీంతో తెలుగు ప్రేక్షకుల్ని అనీల్ 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లబోతున్నారని చెప్పొచ్చు. గతంలో ఇలాంటి జానర్లో చిరంజీవి నటించిన ఎన్నో సినిమాలు మంచి విజయం సాధించినట్లు గుర్తు చేసారు. మరో సాంగ్ తో రెడీగా: ఇటీవలే రిలీజ్ అయిన మీసాల పిల్ల సాంగ్ మంచి హిట్ అయిందని, త్వరలో మరో సాంగ్ తో రానున్నట్లు తెలిపారు. షూటింగ్ పనులు పూర్తి కాగానే ప్రచారం పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే ప్రతీ సంక్రాంతికి ఒక సినిమాతో ప్రేక్షకుల మధ్యలో ఉండాలే ప్లాన్ చేసుకుంటున్నట్లు అనీల్ తెలిపారు. ఈ సినిమాలో చిరంజీవికి జోడీగా లేడీ సూపర్ స్టార్ నయనతార నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా ప్రచారంలో నయన్ జాయిన్ అవుతుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. సినిమా ప్రారంభానికి ముందే నయన్ కొన్ని వీడియోలతో బాస్ కి ఓ రేంజ్ లో హైప్ ఇచ్చిన సంగతి తెలిసిందే.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com